

ఆ విషాదానికి.. ఐదేళ్లు!



49 మందిని బలి తీసుకున్న కచ్చులూరు బోటు ప్రమాదం

- ఐదేళ్ల క్రితం గోదావరిలో పెను విషాదం
- కనీవినీ ఎరుగని రీతిలో 38 రోజుల ఆపరేషన్..
- అతి కష్టంగా గోదావరి గర్భం నుంచి బోటు వెలికితీత
- అప్పటికీ ఇప్పటికీ ఇదొక పెను విషాదమే

పాపికొండలు విహార యాత్రలో 49 మంది పర్యాటకులు గోదావరిలో జల సమాధి అయి సరిగ్గా ఐదేళ్లు గడిచాయి. 2019 సెప్టెంబరు 15వ తేదీన 77 మందితో వెళ్తున్న పర్యాటక బోటు కాస్తా గోదావరిలో సుడిగుండంలో చిక్కుకుంది. అప్పట్లో 26 మందిని స్థానిక జాలర్లు కాపాడినా 49 మంది ప్రాణాలు కోల్పోయారు. దేవీపట్నం మండలం కచ్చులూరు వద్ద జరిగిన ఈ ఘోర దుర్ఘటన ఇప్పటికీ గోదావరి ప్రజలకు కళ్లెదుట సాక్షాత్కరిస్తూనే ఉంది. ఆనాటి ఘోర సంఘటనను తలచుకుంటేనే కంట కన్నీరొలుకుతుంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

పాపికొండలు విహార యాత్రలో ఎన్నడూలేని విధంగా ఐదేళ్ల క్రితం విషాద సంఘటనే చోటుచేసుకుంది. అయినవారిని కోల్పోయినా అనేకమంది నది ఒడ్డునే రోజులతరబడి అన్వేషించారు. అయిన వారు కానరాక, తిండీతిప్పలు లేక రోదనలతో తిరుగాడినవారెందరో. చిన్నారులను కోల్పోయిన కొందరు, భార్యల కడసారి చూపుకైనా నోచుకోవాలని ఇంకొందరు, కనిపించకుండా పోయిన తల్లిదండ్రుల కోసం రెప్పలమాటున కన్నీరువుకుతుండగా విషణ్ణ వదనాలతో వేచి చూసినవారు ఇంకొందరు. పాపికొండలు విహార యాత్ర అంటే ఉమ్మడి ఆంధ్రలో జనం అమితాసక్తి చూపేవారు. రెండు, మూడు రోజులు ముందే గోదావరిలో బోటు ప్రయాణం కోసం తహతహలాడేవారు. ఆ రోజు ఎప్పుడు వస్తుందా అని ఉత్కంఠతో గడిపేవారు. ప్రకృతి అందాలకు నెలవైన పాపికొండలు విహార యాత్ర తమ జీవితానికి గొప్ప అదృష్టమంటూ మురిసిపోయిన వారు ఎందరో. దూరభారమైనా పిల్లాపాపలతో ఒక రోజు అయినా గోదావరి నదిలో గడిపామన్న తృప్తి మిగుల్చుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చేవారు. ఈ క్రమంలోనే 2019 సెప్టెంబరు 15న గోదావరి ఒడ్డున గండిపోచమ్మ దేవాలయం వద్ద వశిష్ఠ పున్నమి రాయల్ పర్యాటక బోటులోకి అప్పటికే నిర్దేశించిన పర్యాటక ప్రియులంతా తమవారితో కలిసి ఎక్కారు. గండిపోచమ్మ దేవాలయం నుంచి దాదాపు మూడున్నర గంటలపాటు ప్రయాణిస్తూ బోటు ముందుకు సాగుతుండగా అప్పటికే ఆటపాటలతో జనం బోటుపైనే సందడి చేశారు. గోదావరికి అటుఇటు కనిపిస్తున్న పచ్చని వాతావరణం, జోరుగా సాగుతున్న నదీ ప్రవాహాన్ని చూసి కేరింతలు కొట్టారు. మరో నాలుగు గంటల్లో పాపికొండలుకు బోటు చేరుకోవాల్సి ఉండగా అసలు విషాదం ఆ సమయంలోనే జరిగింది. దేవీపట్నం మండలం కచ్చులూరు గ్రామం సమీపాన గోదావరి అతి వేగంగా ప్రయాణిస్తూ ఓ సుడిగుండంలా అప్పటికే ఏర్పడి ఉంది. 77 మంది పర్యాటకులతో గోదావరిలో ప్రయాణిస్తున్న వశిష్ఠ బోటు కాస్తా ప్రవాహనికి ఎడమవైపున వెళ్ళాల్సి ఉండగా కుడి వైపున ప్రయాణించి సుడిగుండంలో చిక్కుకుంది. ఒక్కసారిగా హాహాకారాలతో పర్యాటకులంతా కేకలు వేసినా ఫలితం లేకుండాపోయింది. అప్పటికే గోదావరిలో ఐదు లక్షల క్యూసెక్కులకుపైగా వరదనీరు ప్రవహిస్తోంది. ఒకవైపు వరద ఉధృతి, ఇంకోవైపు కచ్చులూరు సమీపాన ఉన్న ఎస్ టైపు ప్రవాహంలోనే బోటు ప్రయాణించాల్సి రావడంతో క్షణాల్లోనే సుడిగుండంలో ఒరిగిపోయింది. అప్పటికే సమీపాన మత్స్యకారులు జరిగిన ప్రమాదాన్ని గమనించి అప్రమత్తమయ్యారు. క్షణాల్లోనే వేగంగా అక్కడికి చేరుకుని 26 మందిని రక్షించి ఒడ్డుకు తీసుకువెళ్ళగలిగారు. అప్పటికే పర్యాటక బోటులో ఉన్న 49 మందితో బోటు కాస్తా గోదావరిలో మునిగిపోయింది. స్థానిక మత్స్యకారులే జరిగిన ఘోరాన్ని అధికారులకు చేరవేయడం, రాష్ట్రమంతటా ఈ ఘటన పెను విషాదాన్ని సృష్టించింది. మునిగిపోయిన పర్యాటక బోటు, మిగతా పర్యాటకుల కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్, నేవీ, అగ్నిమాపక దళాలను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దించింది. నేవీ హెలికాప్టర్ల ద్వారా నడి ఒడ్డున రోజుల తరబడి గాలింపు చేశారు. అక్కడక్కడ ముళ్ళచెట్లకు చిక్కుకుని ఉన్న మృతదేహాలను దేవీపట్నంకు చేర్చగలిగారు. ఇదే సందర్భంలో అప్పట్లోనే కాకినాడకు చెందిన ధర్మాడి సత్యం బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దించింది. వరద ఉధృతిలో నీట మునిగిన బోటును వెలికితీయడంలో ధర్మాడి బృందం మేలైన నైపుణ్యం చూపేది. అయినా గోదావరిలో వరద ప్రవాహం ఉధృతంగా ఉండడం, ప్రమాదం జరిగిన స్థలి అత్యంత కటువుగా ఉండడం, 38 రోజులపాటు శ్రమించి అప్పట్లో అక్టోబరు 21వ తేదీన బోటును వెలికితీయగలిగారు. బోటులో మరికొన్ని మృతదేహాలు పూర్తిగా శల్యమై కనిపించాయి. మరోవైపు ఇప్పటికీ ప్రమాదంలో మృతుల సంఖ్యపై భిన్న వాదనలు విన్పిస్తున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో బోటులో ఉన్నవారి సంఖ్యపై సరైన సమాచారం లేదు. ఈ ఘోర దుర్ఘటన అప్పటికీ ఇప్పటికీ పాపికొండలు పర్యాటక ప్రియులను కలచివేస్తూనే ఉంది. కచ్చులూరు దుర్ఘటన అనంతరం కొన్నాళ్లపాటు పాపికొండలు యాత్రను ప్రభుత్వం అప్పట్లో నిలిపివేసింది. బోటులో ప్రయాణించే వారి రక్షణ చర్యలు పూర్తిగా గమనించిన తర్వాత ప్రయాణించే బోటు సామర్థ్యాన్ని ముందుగా నిర్ధారణ చేసిన తర్వాతే పాపికొండలు యాత్రకు అనుమతిస్తూ వస్తున్నారు.



ప్రమాదం జరిగిన 38 రోజుల తర్వాత బయటకు తీసిన బోటు (ఫైల్)





కైకలూరు మండలం గోకర్ణపురం- పైడిచింతపాడు రోడ్డుపై కొల్లేరు ఉధృతి

కొల్లేరు వరద తగ్గుముఖం

- ఇంకా జలదిగ్బంధంలోనే రహదారులు
- కైకలూరు-ఏలూరు రాకపోకల పునరుద్ధరణ

కైకలూరు, మండవల్లి, సెప్టెంబరు 15 : కొల్లేరు వరద ఉధృతి కొద్దిమేరకు తగ్గినా గ్రామాలను వరద చుట్టుముట్టే ఉంది. కొద్దిమేరకు ఉధృతి తగ్గడంతో కైకలూరు-ఏలూరు ఆర్‌అండ్‌బీ రహదారిలో రాకపోకలు పునరుద్ధరించారు. వరద తగ్గిన ప్రదేశాల్లో గ్రామాల్లో అధికారులు శానిటైజేషన్ పనులు చేపట్టారు. అంటు వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలను చేపట్టారు. మండవల్లి మండలంలోని పెనుమాకలంక, పెద్దఎడ్లగాడి, ఇంగిలిపాకలంక, నందిగామలంక, చింతపాడు, మణుగులూరు, కొవ్వాడలంక గ్రామాలు ముంపు నుంచి బయట పడలేదు. కైకలూరు మండలంలో కొల్లేరు లంక గ్రామాల రహదారులు జల దిగ్బంధంలోనే ఉన్నాయి. ఆయా గ్రామాల నుంచి ప్రజలు పడవల్లో ప్రయాణాలే కొనసాగిస్తున్నారు. వడ్లకూటితిప్ప, కొట్టాడ, జంగంపాడు, పల్లిపాలెం, పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, చటకాయ, నత్తగుళ్లపాడు గ్రామాలను వరద చుట్ట ముట్టిఉంది. వడ్లకూటి తిప్ప, పెంచికలమర్రు మధ్యలో, సర్కారు కాల్వ వద్ద నుంచి పందిరిపల్లిగూడెం వరకు ఉన్న రహదారిలో వరద ఉధృతికి రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయి పెద్దపెద్ద గండ్లు ఏర్పడ్డాయి. గోకర్ణపురం- పైడిచింతపాడు రహదారిలోనూ గండ్లు ఏర్పడడంతో రెండు గ్రామాల మధ్యన ప్రజలు కొల్లేరులో నాటు పడవలపై ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

పోలవరం/బుట్టాయగూడెం, సెప్టెంబరు 15 : కొన్ని రోజులుగా పెరుగుతూ తగ్గుతూ దోబూచులాడిన గోదావరి నీటిమట్టం ఆదివారం నాటికి తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన గోదావరి నీటిమట్టం 31.510 మీటర్లు , దిగువన 22.800 మీటర్లు నమోదైనట్టు ఈఈ మల్లికార్జునరావు తెలిపారు. స్పిల్‌వే నుంచి 7,58,919 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. గోదావరి నీటిమట్టం తగ్గి కడెమ్మ స్లూయిజ్ గేట్లు వరద నీటి నుంచి బయటపడడంతో ఏటిగట్టుకి కుడివైపున ఉన్న పంటపొలాలు వరద జలాల నుంచి బయటపడ్డాయి. రైతులు ఇతర ప్రాంతాల నుంచి వరి నారు తెచ్చి ఊడ్పులకు సమాయత్తమవుతున్నారు. ఎల్‌ఎన్‌డీపేట కొవ్వాడ రిజర్వాయర్ వద్ద నీటిమట్టం 89.80 మీటర్లు నమోదు కాగా 120 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్టు సిబ్బంది తెలిపారు.

జల్లేరు జలాశయం గేట్ల ఎత్తివేత

బుట్టాయగూడెం మండలంలోని శ్రీ గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయం గేట్లను ఎత్తి ఆదివారం 110 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ ఏఈ సురేష్ తెలిపారు. మూడు రోజులుగా ఏజెన్సీలో వర్షాలు కురవకపోయినా అటవీ ప్రాంతంలోని కొండవాగుల నుంచి ఊటనీరు 150 క్యూసెక్కుల వరకు జలాశయంలోకి వస్తున్నట్టు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 217.80 ఎంటీఎస్ కాగా ప్రస్తుతం 215 ఎంటీఎస్‌గా ఉందని ముందు జాగ్రత్త చర్యగా 110 నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. వాగుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నేడు నిమజ్జనాలకు ఏర్పాట్లు

- ఏలూరులో వాహనాల దారి మళ్లింపు
- పోలీసుల భారీ బందోబస్తు



తూర్పు లాకుల వద్ద నిమజ్జన ప్రదేశాన్ని ఆదివారం రాత్రి పరిశీలిస్తున్న త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 15 : వినాయక విగ్రహాల నిమజ్జనాలను పురస్కరించుకుని ఏలూరులో సోమవారం వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15,16 తేదీల్లో ఏలూరు నుంచి వినాయక నిమజ్జన ప్రాంతమైన తూర్పు లాకుల వద్దకు ర్యాలీలు నిర్వహించనున్న నేపథ్యంలో ఏలూరు నుంచి ఆశ్రం ఆస్పత్రికి వెళ్లే వాహనాలను పాతబస్టాండ్ నుంచి ఫ్లయ్‌ఓవర్ మీదుగా అల్లూరి సీతారామరాజు స్టేడియం, మార్కెట్ యార్డు మీదుగా ఆశ్రం ఆస్పత్రికి చేరేలా దారి మళ్లించినట్టు డీఎస్పీ తెలిపారు. వాహనదారులు గమనించాలన్నారు. నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ర్యాలీలు నిర్వహించుకోవాలని పోలీసు అధికారులు ఇప్పటికే సూచించారు. బాణసంచా కాల్చకూడదని సూచించారు. నిమజ్జనం చేసే ప్రాంతాల్లో ముందస్తుగా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 15 : ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 16వ తేదీన రద్దు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మిలాద్ ఉన్ - నబీ పండుగ సందర్భంగా రద్దు చేసినట్టు తెలిపారు.

బాబోయ్ బుస్..బుస్‌లు

వరదలతో అటవీ ప్రాంతాల నుంచి వస్తున్న పాములు -7లో

పెద్దకష్టమే..!

- నూజివీడు పెద్దచెరువుకు గండితో రెండు రకాల నష్టాలు
- ముందు జాగ్రత్త చర్యల్లో అధికారులు విఫలం
- గత ప్రభుత్వ నిర్వహణ లోపం..
- గండి పూడ్చివేతలోనూ అధికారుల నాన్చుడు ధోరణి
- మరోసారి వరదలు సంభవిస్తే నూజివీడుకు తీవ్ర నష్టం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 15 : చెరువుల కట్టలు, కాల్వ కట్టల నిర్వహణలో గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యవైఖరితో పాటు మెట్ట ప్రాంతమే కదా అంత వరదలు వస్తాయేంటి అన్న భావనతో చెరువు కట్టలు, ఎన్‌ఎస్‌పీ కాల్వ కట్టలు దెబ్బతినకుండా చర్యలు చేపట్టడంలో ఇరిగేషన్, ఎన్‌ఎస్‌పీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యవైఖరి వెరసి నూజివీడు పట్టణ ప్రజలకు, రైతాంగానికి శాపంగా మారింది. ఫలితంగా నూజివీడులోని వెలమపేట, గాంధీనగర్ ప్రాంతాలు నీటమునిగాయి. సుమారు 200 ఎకరాల్లో పంట నీటమునగడంతో పాటు ఇసుక, కంకర మేటవేసి తిరిగి వ్యవసాయానికి పనికి రాకుండా భూములు మారాయి. నూజివీడు వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు గండ్లు పూడ్చడానికి చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలు జారీ చేయగా, వాటిని పాటించకుండా అధికారుల నిర్లక్ష్యవైఖరి అవలంభిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోసారి భారీ వర్షాలు పడి వరదలు సంభవిస్తే నూజివీడు మరింతగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

నిర్వహణ లోపంతో రెండు విధాలా నష్టం..

గత వైసీపీ ప్రభుత్వం చెరువులు, కాల్వల నిర్వహణను గాలికి వదిలివేయడంతో నూజివీడు పెద్దచెరువు రెండు రకాలుగా నష్టపోయింది. దాదాపు 208 ఎకరాల విస్తీర్ణం గల చెరువు, మరో 200 ఎకరాల్లో ఆయకట్టు ఉంది. అల్పపీడన ప్రభావంతో కుంభవృష్టి పడడం, ఎగువ ప్రాంతాల్లోని బత్తులవారిగూడెం, సుంకొల్లు గ్రామాల్లోని చెరువులు తెగడంతో పాటు యనమదల వద్ద ఎన్‌ఎస్‌పీ కాల్వ యూటీ కూలిపోవడంతో ఆ నీరు అంతా వాగుల ద్వారా ఒక్కసారి పెద్దచెరువుపై పడింది. దీంతో బలహీనంగా ఉన్న చెరువుకట్టకు మూడుచోట్ల గండి పడింది. మరోవైపు వేసవిలో పెద్దచెరువుకు నీటిని సరఫరా చేసే ఎన్‌ఎస్‌పీ కాల్వకు యనమదల లిఫ్ట్ పంపుల వద్ద యూటీ కుప్పకూలడంతో పెద్దచెరువుకు భవిష్యత్‌లో నీటి సరఫరాకు అవాంతరం ఏర్పడింది. ఇరిగేషన్, ఎన్‌ఎస్‌పీ అధికారుల నిర్లక్ష్యవైఖరి, నూజివీడు వాసులను, నూజివీడు పెద్దచెరువును రెండురకాలుగా నష్టపరిచినట్టు అయింది.



ఎన్‌ఎస్‌పీ కాల్వ లిఫ్ట్‌వద్ద యూటీ కూలిన దృశ్యం

ముందు జాగ్రత్త చర్యల్లో వైఫల్యం

చెరువు కట్టలు బలహీనంగా ఉన్నచోట కట్టలను బలపర్చడంలో ఇరిగేషన్ అధికారులు తీవ్రంగా వైఫల్యం చెందారు. వాతావరణశాఖ రెడ్‌అలర్ట్ ఇచ్చిన నేపథ్యంలో చెరువుకట్టలు బలహీనంగా ఉన్నచోట ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి చర్యలను తీసుకుని ఉంటే ఈ దుర్ఘటన జరిగి ఉండేది కాదు. దాదాపు 40 ఏళ్ల క్రితం ఈ చెరువుకు గండిపడగా, గతంలో ఎక్కడా గండిపడిందో తిరిగి అక్కడే గండిపడడంపై ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి భవిష్యత్‌లో తిరిగి ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పెద్దచెరువుకు పడిన గండి

గండిపూడ్చివేత ఎప్పుడు?

నూజివీడు డివిజన్‌లో భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువులు తదితరాల మరమ్మతులకు రూ.10కోట్లతో అంచనాలు సిద్ధం చేశామని, దాదాపు రూ.25 లక్షలతో పెద్దచెరువు గండిపూడ్చివేతకు చర్యలు చేపడుతున్నామని డివిజన్ స్థాయి అధికారులు చెబుతున్నారు. మరోవైపు మంత్రి పార్థసారథి యుద్ధప్రాతిపదికన చర్యలకు ఆదేశించినా ఇప్పటికి అధికారులు గండిపూడ్చివేత చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈ కష్టాన్ని తీర్చేదెలా..

భారీ వర్షాలకు పెద్దచెరువుకు గండిపడి వరదనీరు ఒక్కసారిగా పొలాలపై పడటంతో పంట పొలాలు కొన్నిచోట్ల భారీకోతకు గురయ్యాయి. మరికొన్నిచోట్ల ఇసుక, మట్టి, కంకర మేటలు వేయడంతో ఆ మేటలను తొలగించడం రైతులకు మరింత భారంగా మారింది. మరోవైపు చెరువు పూర్తిగా ఖాళీ అవ్వగా వరదతో పంటనష్టపోయిన రైతులకు భవిష్యత్‌లో నీటి లభ్యత కష్టమే. మరో ఏడాది పాటు పంటలు పండించే పరిస్థితి ఇక్కడ కానరావడం లేదు.



పెద్దచెరువు వరద ప్రాంత పొలాల్లో మేటవేసిన కంకర

ఏలూరు సిటీ, సెప్టెంబరు 15 : స్వచ్ఛభారత్ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 17వ తేదీ నుంచి అక్టోబరు 2 వతేదీ వరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. మహాత్ముడి జయంతి రోజున ఏటా అక్టోబరు 2వ తేదీన స్వచ్ఛభారత్ దివస్‌గా పాటిస్తున్నారు.'స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత' ఇతివృత్తంగా స్వచ్ఛతా హి సేవా 2024ను నిర్వహిస్తున్నారు. జిల్లా అంతటా పరిశుభ్రతకు సంబంధించిన కార్యకలాపాల్లో సమష్టి కార్యాచరణ, పౌరులలో భాగస్వామ్య స్ఫూర్తిని పునరుద్ధరించడమే ధ్యేయంగా ఈ స్వచ్ఛతా హి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సమాజం మొత్తాన్ని భాగస్వాములు చేసేలా పక్షం రోజుల పాటు మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి ఈ కార్య క్రమం కొనసాగుతుంది. అవి ఏమంటే..

సమష్టిగా ముందడుగు వేయాలి : కలెక్టర్

మహాత్మాగాంధీ వారసత్వాన్ని గౌరవిస్తూ , స్వచ్ఛతను మన జీవన విధానంగా మార్చుకునేలా సమష్టిగా ముందడుగు వేయాల్సిన ఆవశ్యకత ఉందని కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. జిల్లాలో స్వచ్ఛభారత్ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా2024 కార్యక్రమాలను నిర్వహించనున్నాం. జిల్లా స్థాయిలో ఇప్పటికే ఉన్నత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతా హి సేవాల కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమం ఒక మైలురాయిగా నిలిచిపోతుందని కలెక్టర్ పేర్కొన్నారు. రేపటి నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం వివరాలను ఆమె పేర్కొన్నారు.

రేపటి నుంచి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

- స్వచ్ఛతా కీ భాగీదారీ విభాగంలో ప్రజల భాగస్వామ్యాన్ని అవగాహనను ప్రోత్సహించడానికి మారథాన్‌లు, సైక్లోథాన్‌లు, మానవ హారాలు నిర్వహిస్తారు. మొక్కల పెంపకం, సుందరీకరణ పనులు చేపట్టనున్నారు.
- స్వచ్ఛత లక్షిత్ ఏకాయి - సంపూర్ణ స్వచ్ఛత విభాగంలో అధిక జనసాంద్రత కలిగిన ప్రదేశాల్లో సామూహిక పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతూ, పరిశుభ్రత లక్ష్య సాధన కోసం ప్రత్యేకించి ఒక ప్రాంతాన్ని లేదా పారిశుధ్య సమస్యను ఎంపిక చేసుకుని దానికి పరిష్కారాన్ని చూపుతారు
- సఫాయిమిత్ర సురక్ష విభాగంలో పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం , గౌరవాన్ని కాపాడేలా విభిన్న కార్యక్రమాలను చేపడతారు. ఆరోగ్య శిబిరాల నిర్వహణ, సంక్షేమ పథకాల లబ్ధికి ఏకగవాక్ష విధానాన్ని అమలు చేయడం వంటి కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుంది. వారికి ప్రత్యేకంగా భద్రతా శిక్షణలు , పీపీఈ కిట్లు అందిస్తారు. పరిశుభ్రతను కాపాడే క్రమంలో పౌర భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

పక్షం రోజుల పాటు కార్యక్రమాలు ..

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఈనెల 17న మానవహారం, పరిశుభ్రతపై మెగాడ్రైవ్, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. 18న స్వచ్ఛత పరుగులు, బ్లీచింగ్, దోమల నివారణ మందులు పిచికారీ, నీరు నిలిచే ప్రదేశాలను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్స శిక్షణ నిర్వహిస్తారు. 19న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞలు, డంప్‌ల గుర్తింపు తొలగింపు, పారిశుధ్య కార్మికులను గుర్తించి వారిని మంజూరైన పథకాలతో అనుసంధానం చేస్తారు. 20న మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 21న అవగాహనా ప్రచారాలు, ర్యాలీలు, పరిశుభ్రత డ్రైవ్, పార్కులను శుభ్రపరచడం, నిర్వహణ, అభివృద్ధి, పీపీ ఈ కిట్‌లు, సేఫ్టీగేర్లు పంపిణీ నిర్వహిస్తారు. 22న మిషన్ లైఫ్ ప్రచారాలు, కాల్వలు, డ్రెయిన్లు శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తారు. 23న వర్షపు నీటి నిల్వ నిర్మాణాల నిర్వహణపై అవగాహనా, రహదారుల శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తారు. 24న తాగునీటి నిర్మాణాల శుభ్రత, నిర్వహణపై అవగాహనా ప్రచారం, నీటి నమూనా పరీక్షలు, భద్రత, వ్యక్తిగత రక్షణపై సఫాయి మిత్రలు వారి కుటుంబాలకు అవగాహనా ఉంటాయి. 25న వీధి నాటకాలు, మార్కెట్ ప్రాంతాలను శుభ్రపరచడం చేస్తారు. 26న అవాంఛిత యాప్‌లను క్లియర్ చేయడం, సైబర్, డిజిటల్ స్వచ్ఛత, సంస్థాగత భవనాలు శుభ్రపరచడం, పిల్లల సంరక్షణ కార్యక్రమాలు చేపడతారు. 27న గ్రామ, వార్డు సభల నిర్వహణ, ప్రభుత్వ ఖాళీ స్థలాల సుందరీకరణ, టూరిస్టు పాయింట్లు, వీధుల పరిశుభ్రత డ్రైవ్‌లు నిర్వహిస్తారు. 28న సాలిడ్ టెస్ట్ మేనేజ్‌మెంట్ ఆస్తుల సుందరీకరణ, పునర్వినియోగానికి పనికొచ్చే ఈ-వ్యర్థాల సేకరణ వంటి కార్య క్రమాలు నిర్వహిస్తారు. 29న చెత్తను సృష్టించే ఆర్ట్ శానిటేషన్ పార్కులపై అవగాహన కార్యక్రమాలు చేస్తారు. 30న మూలాల విభజన, రీసైక్లింగ్ పద్ధతులు, కంపోస్టింగ్ ప్రదర్శనలు, కమ్యూనిటీ బేస్డ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన డ్రైవ్‌లు, ఆరోగ్య బీమా నమోదులో సహకారం వంటి కార్యకలాపాలు ఉంటాయి. అక్టోబరు 1న విద్యాసంస్థల్లో స్వచ్ఛ హ్యాకథాన్ల నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరచడం, శానిటేషన్ కార్మికులు, ఇతరుల గుర్తింపు, సన్మాన కార్యక్రమాలు చేపడతారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో చీఫ్ ధనాని సూర్యప్రకాష్

జాతీయ కరాటే పోటీల్లో పాలకొల్లు విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు, సెప్టెంబరు 15 : ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శని, ఆదివారాల్లో నిర్వహించిన నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో పాలకొల్లుకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్టు పట్టణానికి చెందిన జపాన్ షోటోఖాన్ కరాటే చీఫ్ ధనాని సూర్యప్రకాష్ తెలిపారు. 14 ఏళ్ళ లోపు ఆల్ కలర్ బెల్ట్ (కటా కుమితే) విభాగంలో 17 మంది పాల్గొన్నారని, వారికి వివిధ పోటీల్లో 30 స్థానాలు లభించాయని ప్రకాష్ తెలిపారు. ప్రథమ స్థానం 13 మందికి, ద్వితీయ స్థానం 11 మందికి, తృతీయస్థానం ఆరుగురికి లభించిందని, బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ పోటీలో రూబి నమ్రత, ఎన్‌జ్యోస్లే ఇద్దరికీ బ్లాక్ బెల్ట్‌లు లభించాయన్నారు. విద్యార్థులను కరాటే మాస్టర్స్ సిహెచ్ లక్ష్మీనారాయణ, ఎస్.అప్పలస్వామి తదితరులు అభినందించారు.



విజేత జట్టుకు చాంఫియన్‌షిప్ ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

జాతీయస్థాయి కరాటే పోటీల విజేతలు

పెదపాడు, సెప్టెంబరు 15: క్రీడల్లో గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జాతీయ స్థాయి షోటోకాన్ కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. రెండు రోజులు జరిగిన కరాటే పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను కనుసుకు సికో షోటోకాన్ ఆధ్వర్యంలో బడేటి కప్పు పేరుతో పోటీలను నిర్వహించగా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు సత్తా చాటి చాంఫియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బడేటి చంటి విజేత జట్టుకు చాంఫియన్‌షిప్ ట్రోఫిని అందజేశారు. ఎండీ బేగ్, డీఎల్ నారాయణ, నాగంశివ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే రఘురామ తదితరులు

చదరంగం విజేతలకు బహుమతులు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 15: తల్లిదండ్రులు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. భీమవరం శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫైడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి.మంత్రి వర్మ, ఎమ్మెల్యే రఘురామలు బహుమతులు అందించారు. జిల్లా చదరంగ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ విజేతలుగా ప్రథమస్థానంలో నిలిచిన ఐలూరి హరి సూర్యనారాయణ(ఏపీ) 60 వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన దివాకరన్ (తమిళనాడు) 50వేలు, తృతీయ తురక రాజు(తెలంగాణ) 35 వేల నగదును గెలుచుకున్నారన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, తోట హరిబాబు, శివరామరాజు, మైలాపురి మురళి, కంతేటి వెంకటరాజు, శ్రీనివాసరావు, అల్లుశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 15 : మహాత్మాగాంధీ 156వ జయంతి పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో విద్యార్థులకు 'గాంధీ తత్వం-నేటి భారతం' అంశంపై ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామని సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. చిత్రాలను ఏ4 షీటుపై వేసి స్కాన్ చేసి జీట్యుచీట్వ్బిజోఃజిట్యుబజీజూ.ఛొరు అడ్రసుకు 24వ తేదీలోపు పంపాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొనవచ్చునని విజేతలకు అక్టోబరు 2న బహుమతులు అందజేస్తారన్నారు. వివరాలకు 99490 93115 నంబర్‌కు ఫోన్ చేయవచ్చునన్నారు.

అశోక్ శ్రీనివాస్ కుటుంబానికి వైఎస్ విజయమ్మ పరామర్శ

కామవరపుకోట, సెప్టెంబరు 15: చింతలపూడి మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్ ఆత్మకు శాంతి కలగాలని వై.ఎస్ విజయమ్మ అన్నారు. ఆదివారం కె.ఎస్ రామవరంలోని అశోక్ శ్రీనివాస్ గృహానికి విజయమ్మ వెళ్ళి ఆయన చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. శ్రీనివాస్ సతీమణి, కామవరపుకోట ఎంపీపీ మేడ వరపు విజయలక్ష్మిని ఓదార్చారు. ఉండి ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు నివాళులర్పించారు. కేవీపీ రామ చంద్రరావుతో మాట్లాడారు.



శ్రీనివాస్ సతీమణిని ఓదారుస్తున్న విజయమ్మ



కేవీపీతో ఎమ్మెల్యే రఘురామ



దర్నా చేస్తున్న మంగళగుంటపాలెం గ్రామస్థులు

కంపోస్టు మా గ్రామంలో వద్దు

రెండో రోజు ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ధర్నా

నరసాపురం టౌన్, సెప్టెంబరు 15: కంపోస్టుయార్డు ఆందోళన రెండోవ రోజు ఆదివారం కొనసాగింది. పురపాలక సంఘానికి సంబంధించిన డపింగ్‌యార్డును మా గ్రామంలో వొద్దంటూ మంగళ గుంటపాలెం గ్రామస్థులు ఊరేగింపుగా ఎమ్మెల్యే కార్యాలయం వద్ద తరలివచ్చారు. పురుగుల మందు డబ్బాలు చేతబట్టి ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే నాయకర్ స్థాని కంగా లేరు. కార్యాలయంలో ఉన్న జనసేన నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరావు, వలవల నాని, గంటా కృష్ణలు గ్రామస్థులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయి నప్పటికీ తగ్గలేదు. ఎమ్మెల్యే వచ్చేవరకు ఆందోళన విరమించమని భీష్మించారు. దీంతో ఎమ్మెల్యే గ్రామస్థులతో ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాసా సత్యనారాయణ, వెంకట రామరావు, వెంకటేశ్వరావు, రమేష్, చందు, భాను, గంగా భవాని, లక్ష్మి, దుర్గా, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ బుస్.. బుస్‌లు



వరదలతో అటవీ ప్రాంతాల నుంచి వస్తున్న పాములు

కట్లపాము, రక్తపింజర, పొడ,తాచుపాములే ఎక్కువ

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో రోజుకు నాలుగు నుంచి ఏడుగురు పాము కాటు బాధితులు

ఏలూరు క్రైం/ అత్తిలి, సెప్టెంబరు 15 : ఇటీవల జిల్లాలో వచ్చిన వర్షాలకు వరద ప్రవాహంతో అడవుల్లో ఉన్న పాములు వర దలకు కొట్టుకువచ్చి గ్రామాలపై పడ్డాయి. మరికొన్ని పాములు ఆ వరద ప్రవాహంలో కొట్టుకొచ్చి సమీపం లోని పొలా ల్లోకి చేరాయి. కొల్లేరు, తమ్మిలేరు, బుడమేరు, రామి లేరు, ఏజెన్సీలో కొండవాగుల వరదలతో పలు ప్రాంతాలు నీటమునిగాయి. వరద నీటిలో పాములు కొట్టుకువచ్చి ఊళ్ల మధ్యకు చేరాయి. ఇటీవల ఏలూరు ప్రభుత్వాస్పత్రికి రోజుకి నాలుగు నుంచి ఏడు కేసులు పాము కాటుకు గురైన వారు వస్తున్నారంటే ఈ పాములు ఏ విధంగా ప్రజల మధ్యలోకి వచ్చాయో అర్థం చేసుకోవచ్చు.పొలం పనులకు వెళ్లిన వారు, పొలంలో గడ్డి కోసేవారు, గట్లపై నడిచేవారే ఎక్కువ పాముకాటుకు గురవుతున్నారు. వర్షాకాలం కావడంతో వర్షాలు పడేటప్పుడు కట్లపాములు ఇళ్లమెట్ల వద్ద పడుకుని ఉంటాయి.



రైతులు, కూలీలు.. జాగ్రత్త

వర్షాలు, వరదలతో కలుగుల్లో దాక్కున్న పాములు బయటకి వస్తున్నాయి. పొలం పనులకు వెళ్తున్న వారిని కాటేసి ప్రాణాలు బలిగొంటున్నాయి. రెండు నెలలుగా పాము కాటు బాధితులు పెరుగుతున్నారు.వరి పొలాల్లో ఎక్కువగా పాముల బెడద ఉంటుంది.రైతులు, కూలీలు జాగ్రత్తగా ఉండాలి.

అన్నీ విష కారకం కాదు

పాములన్నీ విషకారకం కావని వైద్య సిబ్బంది తెలిపారు. పాము కరిచిన చోట రెండు గాట్లు ఉంటే 90 శాతానికి పైబడి విషకారక పాము కాదని భావిస్తామన్నారు. పాముకాటు బాధితు లకు రక్తం వాంతులు, మలమూత్ర విసర్జన సమయంలో రక్తస్రావం, మగత ఉంటాయన్నారు. విషకారక పాము కాటుకు వెంటనే చికిత్స తీసుకోకుంటే కిడ్నీలతో పాటు శరీరంలోని ముఖ్య అవయవాలన్నీ పాడైపోతే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందన్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితికి అను గుణంగా ఒకటి నుంచి నాలుగు వరకూ ఏఎస్‌వీ ఇంజక్షన్లు వేసి ప్రాణాలు కాపాడతామన్నారు.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు

భూమిపైన వస్తువులను చప్పుడు చేస్తూ వెళ్ళితే ఏమైనా పాములు ఉన్నా ఆ శబ్దానికి పారిపోతాయి. సుమారు ఐదు అడుగుల పొడవు ఉన్న కర్ర ఎప్పుడూ చేతిలో ఉండాలి. పాము ఉన్న చోట చుట్టూ కందకం తవ్వాలి లేదా కళ్ల ఉప్పు మూడు రోజులకు ఒకసారి చల్లాలి. ఉప్పు పాము చర్మానికి అసౌకర్యం కలిగిస్తుంది. తడి నేలమీద పాములు పాకిన గుర్తులు కనిపిస్తాయి. పాముల సంచారం కనిపిస్తే పక్షులు అరుస్తాయి. అలాగే కుక్కలు కూడా పాములు కనిపిస్తే సూచన చేస్తాయి. పాములు కేవలం మోకాలు ఎత్తు లేదా కొంచెం ఎక్కువ ఎత్తు వరకూ మాత్రమే చేరతాయి. పాములు తిరిగే చోట పనిచేసే వాళ్ళు మోకాళ్లపై వరకూ కప్పి ఉంచే గమ్‌షూట్‌తో పాటు మందంగా ఉండే జీన్స్ ధరిస్తే రక్షణ నిస్తాయి.

గంట వ్యవధిలో తీసుకు వస్తే ప్రాణాలు కాపాడవచ్చు



పాము కాటుకు గురైన వారిని నడవ నివ్వకూడదు. చేతులపైన భుజం పైన ఎత్తుకుని తీసుకురావాలి. కాటు జరిగిన ప్రదేశంలో ఎలాంటి కట్లు కట్టకూడదు. ఎన్ని గంటలకు కరిచిందో ఖచ్చితంగా సమయాన్ని గుర్తుంచు కోవాలి. ఆస్పత్రికి రాగానే బ్లీడింగ్ టైమ్, క్లాటింగ్ టైమ్ (బీటీసీటీ) పరీక్ష నిర్వహిస్తాం.రక్తం ఎంత సమయంలో గడ్డ కడుతుందో నిముషాల్లో చూస్తాం. సాధారణంగా పది నిముషాల్లోపు గడ్డ కడితే విషం ప్రభావం అంతగా లేనట్టే. గడ్డ కట్టకుండా ఎక్కువ సమయం తీసుకుంటే విష ప్రభావం రక్తంలో కలిసి పోయిందని గుర్తించి యాంటీ స్నేక్ వీనమ్ (ఏఎస్‌వీ) వైల్స్‌ను సెలైన్‌లో కలిపి ఎక్కిస్తాం. సాధారణంగా బీటీసీటీ పరీక్ష ఆధారంగా రోజుకు పది నుంచి 20 వైల్స్ వరకు ఎక్కించి విషానికి విరుగుడు చేస్తాం. పాము కాటు వేసిన తర్వాత గంట వ్యవధిలోనే తీసుకొస్తే రక్తపరీక్షలు నిర్వహించి వైద్యం అందించడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎక్కువగా కట్ల పాములు, రక్తపింజర, పొడపాములు కాటుకు గురైన వారు ఆస్పత్రికి వస్తున్నారు.

- డాక్టర్ ఎం.సుమన్, అత్యవసర విభాగపు వైద్య నిపుణులు, ప్రభుత్వ ఆసుపత్రి, ఏలూరు



ఆసుపత్రి వద్ద బాలిక తాత రోదన.. మృతిచెందిన బాలిక మధుర

పాముకాటుకు బాలిక మృతి

ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆందోళన

భీమవరం క్రైం, సెప్టెంబరు 15 :పాము కాటుకు గురైన బాలికకు వైద్యం చెయ్యకుండా వైద్యులు నిర్లక్ష్యం చేసి మృతికి కారణం అయ్యారు అని బంధువులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన తుమ్మిడి సతీష్, దుర్గాలక్ష్మీ దంపతులకు ఇద్దరు కవలలు. పెద్ద కుమార్తె అయిన తుమ్మడి మధుర (7)శనివారం ఆడుకుంటూ రోడ్డుపైకి రావడంతో పాముకాటుకు గురైంది. తల్లితండ్రులు వెంటనే గ్రామంలోని ఆర్‌ఎంపీ దగ్గరకు తీసుకువెళ్ళగా వెంటనే పెద్ద ఆసుపత్రికి తీసుకువెళ్ళాలని చెప్పడంతో భీమవరం ఉండి రోడ్డులో ఉన్న ఒక ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడ జాయిన్ చేసుకున్న వైద్యులు సుమారు 2 గంటల తరువాత వేరే ఆసుపత్రికి తీసుకువెళ్లమని చెప్పడంతో వారు హుటాహుటిన వేరే ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలిక మృతి చెంది అరగంట అవుతుందని చెప్పారు.

ఆసుపత్రి వద్ద ఆందోళన

ముందుగా వైద్యం చేసిన ఆసుపత్రికి మృతదేహాన్ని తీసుకుని బంధువులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలిక మృతి చెందింది అంటూ నిరసన తెలిపారు. జాతీయ రహదారిపై బైఠాయించి సుమారు 8 గంటల పాటు రాస్తారోకో చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడారు. చివరకు తెల్లవారుజామున 5గంటలకు ఆందోళన విరమించారు.

పీహెచ్‌సీల్లో వ్యాక్సిన్లు ఉన్నాయి : డీఎంహెచ్‌వో

ఆకివీడు రూరల్ : పాముకాటుకు విరుగుడు వ్యాక్సిన్లు అన్ని ప్రాథమిక ఆసుపత్రులలో సిద్ధం ఉన్నాయని డీఎంహెచ్‌వో మహేశ్వరరావు అన్నారు. వరదల కారణంగా పాములు జనసంచారంలోనికి వస్తున్నాయి. పాము కరవగానే కంగారు పడకుండా దగ్గరగా ఉండే ప్రాథమిక ఆసుపత్రికి తీసుకు వెళ్లాలి. పాము కరిచినచోట నోటితో రక్తం పీల్చడం, కాల్చడం వంటివి చెయ్యకూడదు. ఒత్తిడికి గురవ్వకుండా ప్రశాంతంగా ఉండి ప్రాథమిక చికిత్స పొందాలని సూచించారు. పంచాయతీలు గ్రామాలలో చెట్లు, పొదలు, తుప్పలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బయనపాలెం గణేశ్ ఉత్సవాల్లో ఉద్రిక్తత

ఊరేగింపులో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ

పలువురికి గాయాలు.. మోహరించిన పోలీసులు

నరసాపురం రూరల్, మొగల్తూరు,సెప్టెంబరు 15: నరసాపురం మండలం ఎల్‌బీ చర్ల గ్రామంలోని బయనపాలెం ఆదివారం రాత్రి గణేష్ నిమజ్జనం ఊరేగింపులో ఇరు సామాజిక వర్గాల మధ్య తలెత్తిన వివాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఊరేగింపు సాగుతున్న సమయంలో ఒక పాట వేయడాన్ని మరో సామాజిక వర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఇరు వర్గాల మధ్య జరిగిన వాదోపవాదాలు ఘర్షణలకు దారితీశాయి. ఇరువురు పరస్పరం రాళ్ళతో దాడులు చేసుకున్నారు. దాదాపు మూడు గంటల పాటు గ్రామంలో హైటెన్షన్ నెలకొంది. ఇద్దరు పోలీసులతో పాటు పలువురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన తిరుమాని రాజేష్‌ను స్థానికులు నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఇద్దరు కానిస్టేబుళ్ళు కూడా రాళ్ళదాడిలో గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం గ్రామంలో మూడు రోజుల క్రితం గణేష్ ఊరేగింపు సందర్భంగా ఒక సినిమా పాట వేయడాన్ని గ్రామంలోని మరో సామాజిక వర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. తరువాత గ్రామ పెద్దలు ఈ పాటను వేయవద్దని ఆదేశించారు. అయితే ఆదివారం సాయంత్రం మరో సామాజిక వర్గం ఇదే పాటను వేస్తూ ఊరేగింపుగా వెళ్ళుతుండగా మళ్లీ ఆ సామాజిక వర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఇరువురు మధ్య మాట మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. పరస్పరం రాళ్ళు విసురుకున్నారు. ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ మురళీకృష్ణ, రూరల్ సీఐ కృష్ణ ప్రసాద్ మొగల్తూరు, రూరల్ ఎస్‌లు గ్రామానికి చేరుకుని పరిస్థితి చక్కదిద్దారు. పరిస్థితి పూర్తి అదుపులో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు.



పోలీసుల పహరా..ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 15: గణపతి వేడుకల్లో జరిగిన ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతున్న ఎం.ప్రసన్నకుమార్ (23) ఆదివారం మృతి చెందాడు. ఈనెల 10న తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి సమీపంలో గణపతి వేడుకల్లో ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో మెకానికర్ ప్రసన్నకుమార్‌ను అదే ప్రాంతానికి చెందిన యర్రా సతీష్ స్టేజ్‌రాడ్డుతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే కూలబడిపోయాడు. రాజమండ్రి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించగా చికిత్స పొందుతున్న ప్రసన్నకుమార్ ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

లోక్ అదాలత్‌లో 2,633 కేసులు పరిష్కారం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 15 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 2,633 కేసులు పరిష్కారం జరిగినట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్ తెలిపారు. ఈనెల 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జిల్లా అడ్మిన్ జడ్జి, హైకోర్టు జడ్జి సురేష్ రెడ్డి ఆదేశాలతో లోక్ అదాలత్‌లో 33 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరులో 8, భీమవరంలో 4, కొవ్వూరులో 3, నర్సాపురంలో 4, తణుకులో 4, తాడేపల్లిగూడెంలో 4, పాలకొల్లు 2, నిడదవోలు 1, జంగారెడ్డిగూడెం 2, చింతలపూడి 1, భీమడోలు 1 బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. 2,146 క్రిమినల్, 124 మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, 193 సివిల్, 170 ప్రీలిటిగేషన్ కేసులు ఆన్‌లైన్ ద్వారా 23 కేసులను పరిష్కరించామన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

డీటీసీ డీఎస్పీగా ప్రసాదరావు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 15 : ఏలూరు జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం డీఎస్పీగా ప్రసాదరావును నియమించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న డీఎస్పీలలో 47 మందిని బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న డీఎస్పీ ప్రసాదరావును జిల్లా ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీగా నియమించారు.

తాడేపల్లిగూడెం డీఎస్పీగా విశ్వనాథ్



తాడేపల్లిగూడెం రూరల్ :సీఐడీ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న డి.విశ్వనాథ్‌ను తాడేపల్లిగూడెం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (డీఎస్పీ)గా నియమించారు. ఇప్పటి వరకూ తాడేపల్లిగూడెం డీఎస్పీగా పనిచేస్తున్న మూర్తిని ఏసీబీ విభాగానికి బదిలీ చేశారు.



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్..పోలీస్ జాగిలం పరిశీలన

కేపీపాలెం జ్యూయలరీ షాపులో భారీ చోరీ

రూ.40 లక్షలు విలువ చేసే బంగారం అపహరణ

పట్టుకెళ్లని వెండి వస్తువులు..పోయిందంతా తాకట్టు బంగారమే

నరసాపురం/మొగల్తూరు, సెప్టెంబరు 15: నరసాపురం మండలం తూర్పుతాళ్ళు, మొగల్తూరు మండలం కేపీపాలెం సరిహద్దునున్న దుర్గా జ్యూయలరీలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. సుమారు రూ.40 లక్షలు విలువ చేసే బంగారు వస్తువులను దుండగులు అపహరించుకుపోయారు. వెండి వస్తువులను ముట్టుకోలేదు. చోరీకి గురైన వస్తువులన్నీ తాకట్టు బంగారమే. శనివారం ఇదే మండలంలోని రామన్నపాలెంలో ఓ ఇంట్లో చోరీ జరిగిన కొన్ని గంటలకే మరో భారీ దొంగతనం వెలుగుచూడటం తీరంలో చర్చనీయాంశమైంది. రామన్నపాలెంలో జరిగిన చోరీలో దుండగులు సీసీ కెమేరాల హార్డ్ డిస్క్‌ను ఎత్తికేళ్లారు. అదే తరహాలో ఈ బంగారం దుకాణంలో కూడా ఎటువంటి ఆధారాలు లేకుండా హార్డ్ డిస్క్‌ను తీసుకెళ్లడంతో రెండు చోరీలు ఒకే ముఠా చేసిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కథనం ప్రకారం నరసాపురం మండలం ఎల్‌బీ చర్ల గ్రామానికి చెందిన చామకూరి గోపి కొన్నేళ్ల నుంచి మొగల్తూరు, నరసాపురం మండలాల సరిహద్దునున్న కేపీపాలెంలో జ్యూయలరీ, తాకట్టు వ్యాపారం నిర్వహిస్తున్నాడు. శనివారం దుకాణం కట్టి వేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం వెండి వస్తువు కోసం కస్టమర్ ఫోన్ చేశాడు. అయితే యాజమాని వెళ్ళకుండా షాపులో పనిచేసే వర్కర్‌కు తాళాలు ఇచ్చి పంపించాడు. షాపు తీయగానే పైన కన్నం వేసి ఉంది. వస్తువులన్నీ చిందరబందరగా పడ్డాయి. వెంటనే యాజమానికి ఫోన్ చేయడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

పక్కా ప్లాన్‌తోనే చోరీ..

ఈ చోరీ పక్కా ప్లాన్‌గా జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దుకాణానికి కొంది దూరంలోని మామిడితోటలో తాపీపనులకు ఆద్దెకిచ్చే పని ముట్ల దుకాణం ఉంది. అక్కడ నుంచి చెక్క నిచ్చెన తీసుకొచ్చి దుకాణం వెనుక నుంచి పెకి ఎక్కి కన్నం పెట్టారు. లోపల ఉన్న వెండి వస్తువుల్ని ముట్టుకోలేదు. తాకట్టులో ఉన్న బంగారాన్ని మాత్రమే చోరీ చేశారు. శనివారం సాయంత్రం ఈ గ్రామానికి సమీపంలో ఉన్న రామన్నపాలెంలో ఇదే తరహాలో చోరీ జరిగింది. 8 కాసుల బంగారాన్ని ఎత్తికెళ్లారు.ఈ రెండు చోరీలు ఓకే తరహాలో జరగడంతో అనుమానాలు తలెత్తుతున్నాయి. సంఘటన స్థలాన్ని జిల్లా అదనపు ఎస్పీ భీమరావ్, డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై వాసులు సందర్శించారు. జిల్లా నుంచి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. కుక్కలు గ్రామ శివారున్న బ్యాంకు వరకు వచ్చి ఆగిపోయాయి.

వినాయక ఉత్సవ మండప కార్యాలయంలో చోరీ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 15: ఎం.నాగులపల్లి పంచాయితీ పరిధిలోని ద్వారకానగర్‌లోని వినాయక ఉత్సవ మండపంలో జొరపడి దొంగతనానికి తెగబడ్డారు. అక్కడున్న విలువైన దస్తావేజులు, రసీదు పుస్తకాలు, దాతల వివరాలతో ఉన్న పుస్తకాలు అపహరించారు. అయితే వాటితో పాటు ఉన్న నగదును తస్కరించకపోవడంతో ఇది ఇంటిదొంగల పనే అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటనపై కమిటీ అధ్యక్షుడు అబ్బూరి రాంబాబు ఆదివారం ఉదయం ద్వారకాతిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు

క్రైం కార్నర్..



వివరాలు తెలుపుతున్న డీఎస్పీ రవిచంద్ర.. స్వాధీనం చేసుకున్న సొత్తు

నలుగురు దొంగల అరెస్ట్

అరవై గ్రాముల బంగారం, అరకేజీ వెండి స్వాధీనం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 15 : వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.నాలుగు లక్షల ముప్పై ఐదు వేల విలువైన అరవై గ్రాముల బంగారం, అరకేజీ వెండి స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ రవిచంద్ర వివరాలను వెల్లడించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో త్రివేణి కళాశాల వెనుక టీచర్స్ కాలనీలో ఓ ఇంటి తాళాలు పగలగొట్టి ఆ ఇంట్లో చోరీకి పాల్పడ్డారని, అయ్యప్ప టౌన్ షిప్‌లోని మూడవ రోడ్డులో మరో ఇంటిలో చోరీకి పాల్పడ్డారని, కామవరపుకోట మండలం రావికంపాడులో జరిగిన చోరీలో సొమ్ము రికవరీ చేశామన్నారు. నేరస్తులైన కర్రి రాజేష్, కామంచి కోటేశ్వరరావు, సమ్మంగి మంగరాజు, తల్లాడి భాస్కర దుర్గాప్రసాద్ జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వారేనని వీరికి గతంలో కూడా నేర చరిత్ర ఉందని తెలిపారు. సీఐ కృష్ణబాబు, ఎస్సై జబీర్, ఏస్సైలు ఎన్‌వి.సంపత్ కుమార్, ఎన్.రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెంటపాడు, సెప్టెంబరు 15: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ముదునూరులో చోటు చేసుకుంది. అత్తిలి గ్రామానికి చెందిన ఏడిద సత్యనారాయణ (69) తాడేపల్లిగూడెం మార్కెట్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం తన పని ముగించుకుని మోటర్‌సైకిల్‌పై అత్తిలి వెళ్తుండంగా పిప్పర నుంచి తాడేపల్లిగూడెం వైపు వస్తున్న టాటా ఏస్ వాహనం ముదునూరు బంక్ వద్ద పెట్రోలు కొట్టించుకునేందుకు వాహనాన్ని తిప్పాడు. దీంతో మోటర్ సైకిల్‌పై వస్తున్న సత్యనారాయణ టాటా ఏస్ వాహనాన్ని ఢీకొని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించామని మృతుని కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పెంటపాడు ఎస్ఐ స్వామి తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మొగల్తూరు,సెప్టెంబరు 15: వేధింపులు తాళలేక ఒక మహిళ ఆత్మహత్య చేసుకున్నట్టు మొగల్తూరు ఎస్ఐ వాసు తెలిపారు. మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలేనికి చెందిన భూసి ఝాన్సీ మేరీ (32) ఈనెల 13 రాత్రి బహిర్భూమికి వెళ్ళింది.ఆ సమయంలో గ్రామానికి చెందిన నలుగురు యువకులు ఆమెను వేధించడంతో ఇంటికి వెళ్ళి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త కుమార్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యాను ఢీకొని యువకుడి మృతి



ఏలూరు క్రైం, సెప్టెంబరు 15 : మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు యువ కులు రోడ్డుపై ఆగి ఉన్న వ్యాను ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు గాయాలపాలయ్యాడు. భీమడోలు మండలం కురెళ్ళగూడానికి చెందిన ఎలక్ట్రీషియన్ వాడాడి భవానీ శంకర్ (20) ఆది వారం సాయంత్రం మోటారు సైకిల్‌పై మరో యువకునితో కలిసి తాడే పల్లిగూడెం నుంచి కురెళ్ళగూడెం వస్తుండగా జాతీయ రహదారిపై ప్యాచ్ వర్క్ చేస్తున్న వాహనం ఆగి ఉంది. ఆ వాహనాన్ని మోటారు సైకిలిస్టు ఢీకొట్టాడు. ఇద్దరికి గాయాలవగా హైవే పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే భవానీ శంకర్ మృతి చెందాడని నిర్ధారించారు. మరో యువకుడు చికిత్స పొందుతున్నాడు. ఆసు పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పల్నాడులో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు యువకుల మృతి



రవికిషోర్



వడల కృష్ణ

నిడమర్రు (ఉంగుటూరు) సెప్టెంబరు 15 : పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురం పరిధిలో జాతీయరహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. ఏలూరు జిల్లా నిడమర్రు గ్రామానికి చెందిన ఈబుచర్ల రవికిషోర్ (22), వడల కృష్ణ(31)లు తూర్పు గోదావరి జిల్లా కాకినాడ హేచరీ కంపెనీలో హల్టింగ్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. నెల్లూరు వెళ్లి రొయ్యల పిల్లల శాంపిల్స్ తీసుకు వస్తుండగా ప్రమాదం జరిగింది. ఆదివారం తెల్లవారు జామున 3.30 గంటలకు తిమ్మాపురం గ్రామ పరిధిలోని తిరుమల నూలు పరిశ్రమ సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు కుడివైపు వెనుక టైరు పంక్చరవడంతో కారును రోడ్డు పక్కన ఆపుకుని టైరు మార్చుకుంటుండగా గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఇరువురిని ఢీకొట్టి ఆగకుండా వెళ్ళిపోయింది. ఈ సంఘటనలో రవికిషోర్ అక్కడికక్కడే మృతిచెందగా, కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. హైవే పెట్రోలింగ్ పోలీసులు గాయపడిన కృష్ణను అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ కృష్ణ ఆదివారం ఉదయం మృతిచెందాడు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దంపతుల అనుమానాస్పద మృతి

భార్యను హతమార్చి భర్త ఉరి ?



విచారణ నిర్వహిస్తున్న జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర



మంచంపై భార్య మృత దేహం

కామవరపుకోట, సెప్టెంబరు 15 : కుటుంబ కలహాలతో భార్యను హత మార్చి అనంతరం భర్త ఉరి వేసుకున్న సంఘటన కామవరపు కోట మండలం రావికంపాడు పంచాయతీ వెంకటాపురంలో చోటుచేసుకుంది. జంగారెడ్డి గూడెం డీఎస్పీ రవిచంద్ర తెలిపిన వివరాల ప్రకారం వెంకటాపురం గ్రామానికి చెందిన మానుపాటి మరియ (26)తో పెరవలి మండలం పిట్లవేమవరం గ్రామానికి చెందిన మానుపాటి శ్రీనుతో ఆరేళ్ళ క్రితం వివాహం జరిగింది. వివాదాల కారణంగా శ్రీను పిట్లవేమవరంలోనే ఉంటున్నాడు. ఇటీవల పెద్దల సమక్షంలో చర్చలు జరిపి వారిద్దరిని కాపురం చేసుకునే విధంగా తీర్మానించారు.అప్పటి నుంచి పిట్లవేమవరంలోనే ఉంటూ తరచుగా శ్రీను వచ్చి వెళ్తున్నాడు. ఈ నేథ్యంలో శనివారం రాత్రి శ్రీను మరియ నివాసానికి వచ్చాడు. వారి మధ్య గొడవ జరిగినట్టు సమాచారం. మంచంపై మరియ మృతి చెంది పడి ఉంది. శ్రీను అదే గదిలో దూలానికి ఉరివేసుకుని ఉన్నాడు. కేసుపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ పేర్కొన్నారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు.

లంబాడీలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలి

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 15: గిరిజన లంబాడీలకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని ఎస్టీ బంజార, సుగాలి, లంబాడి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా నాగేశ్వరరావు నాయక్ అన్నారు. గిరిజన భవన్‌లో ఆదివారం జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షలకు పైగా గిరిజన లంబాడీలు ఉన్నప్పటికి చట్టసభల్లో ప్రాధాన్యత లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారవత్తు కిమ్యా నాయక్ మాట్లాడుతూ లంబాడీల ఆరాధ్యదైవం శ్రీసేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవు రోజుగా ప్రకటించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాబాబు పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

పంటను దున్నివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 15 : గిరిజనులు సాగు చేసిన ప్రత్తి, మినుము పంటలను ట్రాక్టరుతో దున్నివేసిన గిరిజనేతరులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. బుట్టాయగూడెంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కట్టుపల్లికి చెందిన ఎడబ్ల్యుడీ ప్రభుత్వ భూమిని 30 ఏళ్లుగా స్థానిక గిరిజనులు సాగు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనేతరులకు ఆర్డీవో ప్రొడక్షన్ ఆర్డర్ ఉందంటూ శనివారం రాత్రి నందాపురంనకు చెందిన గిరిజనేతరులు, బుట్టాయగూడెంకు చెందిన గిరిజనుడితో కలిసి పంటలను ట్రాక్టరుతో దున్నివేశారని తెలిపారు. ఉన్నతాధికారులు రికార్డుల పరిశీలించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. పి.నాగేశ్వరావు, బి.ముత్యాలమ్మ, మంగరాజు, ఎం.కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ వ్యాయామ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దెందులూరు,సెప్టెంబరు 15 : వ్యాయమ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అభినందయమని సీనియార్ వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియాల్ అన్నారు. గోపన్న పాలెంలోని వ్యాయామ కళాశాలలో 1993-94లో బీపీఈడీ చదివిన పూర్వ వ్యాయమ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. నాటి గురువులు సత్యనారాయణరాజు, కృష్ణంరాజును సత్కరించారు. అనంతరం నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ ఆర్‌వీఈ మనోహర్ ఆధ్వర్యంలో, ఎంఎస్ రాజా, వై.శ్రీనివాస్, జగదీష్, నాగేశ్వర రావు, ఎం.శ్రీనివాస్,

ముస్లింల మోటారు సైకిల్ ర్యాలీ



ఏలూరు రూరల్, సెప్టెంబరు 15: మహ్మద్‌ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్‌ఉన్‌నబీని పురస్కరించుకుని అహేలే సునత్‌వల్ జమాత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లిం యువత భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఎస్ఆర్ స్టేడియం వద్ద నున్న షాదీఖానా నుంచి ర్యాలీని సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు ఎస్‌కే సాబీర్‌హుస్సేన్ మాట్లాడుతూ మహ్మద్‌ప్రవక్త ప్రజలకు శాంతి మార్గాన్ని చూపారని, ప్రతిఒక్కరూ ఆయన చూపిన దారిలో పయనించాలన్నారు. సోమవారం సాయంత్రం కర్బలా మైదానంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం, తదుపరి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎండీ కాశీంరాజా ఆధ్యాత్మిక ప్రసంగం ఏర్పాటు చేశామని తెలిపారు. సంస్థ కార్యదర్శి ఎండీ గాలబ్‌ఆలీ, ప్రచార కార్యదర్శి ఎండీ ఇక్బాల్, ఎండీ ఉస్మన్‌దౌలా, అస్లామ్ రాజా పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



ఏలూరు రూరల్, సెప్టెంబరు 15: కేరళ, తెలంగాణ, యానం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవలే జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఏఎస్ఆర్ స్టేడియంలో ఉన్న కేలో ఇండియా సెంటర్‌కు చెందిన బాలికలు ప్రతిభకనబర్చి పతకాలు సాధించారని, సాయిసెంటర్ చీఫ్‌కోచ్ డీఎస్‌వీ వినాయకప్రసాద్ తెలిపారు. స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఆదివారం క్రీడాకారులను పలువురు అభినందించారు. ఎం.పావని బంగారు పతకం, సిహెచ్ కీర్తన వెండి, జి.పవిత్ర వెండి, సిహెచ్ హారికరెడ్డి వెండి పతకాలు సాధించారన్నారు. అలాగే రేణుమోల్ 71 కేజీ విభాగంలో బంగారంతో పాటు బెస్ట్‌లిఫ్టర్ అవార్డు సాధించిందన్నారు. 82 కేజీల విభాగంలో పి.దివ్య బంగారు పతకం సాధించి, తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ గెలిచిందన్నారు. యానాంలో జరిగిన పోటీల్లో జి.సాహితి రెండు బంగారు, వెండి, ఎస్.వర్షిణి బంగారు పతకం, ఏ.తేజశ్రీ వెండి పతకం సాధించిందన్నారు. అలాగే వి.నీలిమ రెండు వెండి పతకాలు సాధించిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, కోచ్ వై.ఉదయ్‌సందీప్, సుభాషిణి, క్రీడాకారులను అభినందించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఉంగుటూరు :** అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కైకరం కొత్తూరు ఎంపీపీ పాఠశాలలో వయోజన విద్యపై పెద్దలు, సీనియర్ సిటిజెన్స్‌కు చేబ్రోలు కార్మెల్ హైస్కూలు ఆధ్వర్యంలో అక్షరాస్య తపై అవగాహన కల్పించారు.
- ఉంగుటూరు మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు వెంకట్రావు (100) ఆదివారం మృతి చెందారు.
- **పెదవేగి :** గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథాలయని రావాలని గ్రంథపాలకుడు టి.అరుణ్‌కుమార్ అన్నారు.
- **భీమడోలు :** సీతారామ్ ఏచూరి సంతాప సభ భీమడోలు సీపీఎం కార్యాలయంలో జరిగింది. ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్.లింగరాజు,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.
- బోనస్ బకాయిలు చెల్లించాలని సూరప్పగూడెం షుగర్ ఫ్యాక్టరీ విశ్రాంత ఉద్యోగుల డిమాండ్ చేశారు. గ్రామ దేవతల ఆలయంలో ఆదివారం కార్మికుల సమావేశమై 2000 నుంచి 2003 వరకూ 1,784 మందికి బోనస్ సొమ్ము ఇవ్వాల్సి ఉందన్నారు.
- **ఏలూరు అర్బన్ :** కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీపీడీసీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని కళాశాలకు ఐదు సీలింగ్ ఫ్యాన్లను ఆదివారం బహూకరించారని ప్రిన్సిపాల్ గిరిబాబు తెలిపారు.
- **ఏలూరు రూరల్ :** విరాట్ విశ్వకర్మ భగవానుని యజ్ఞమహోత్సవాలు ఈనెల 17న జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సింహాద్రిబ్బంగాచారి, కార్యదర్శి మానేపల్లి నాగేశ్వరరావు తెలిపారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 18వ తేదీ వరకు జరగనున్న 23వ వార్షిక పవిత్రోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి.
- **చింతలపూడి :** పట్టణ సీనియర్ కార్యకర్త మోరం ఈశ్వరకుమార్ గుండెపోటుతో మృతి చెందారు. రత్నావిలేజ్‌లో ఉన్న ఆయన గృహానికి వెళ్ళి మాజీ సర్పంచ్ సీహెచ్.ధర్మరాజు, మండల టీడీపీ అధ్యక్షులు ఎం. వెంకటరామయ్య, పట్టణ అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, కె.శేషగిరిరావు నివాళులర్పించారు.
- స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో కృష్ణారావు 110వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, జిల్లా అధ్యక్షులు పి.సోమశేఖర్, ఎం.వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.
- **టి.నరసాపురం :** ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేసిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌కి టీడీపీ మండల తెలుగు రైతు సంఘం మాజీ అధ్యక్షుడు గంటా సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఆయన కృషి వల్ల పామాయల్ టన్నుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ధర పెరిగే అవకాశం ఉందన్నారు.
- **కుక్కునూరు :** కుక్కునూరు వైసీపీ మండల కన్వీనర్ ఎంపిక కోసం సోమవారం మండల వైసీపీ నాయకులు సమావేశం అయ్యారు. ఇప్పటి వరకు మండల కన్వీనర్‌గా కుచ్చేర్లపాటి నరసింహరాజు పని చేశారు. అయితే ఎన్నికల అనంతరం ఆయన రాజీనామా చేయడంతో మండల కన్వీనర్ ఎన్నిక అనివార్యం అయ్యింది. ఈ సమావేశంలో రాయి రవీంధర్‌ను వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కన్వీనర్‌గా ఆమోదించారు.



ఏలూరులో వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చంటి



ద్వారకాతిరుమల మండలం దేవినేనివారిగూడెంలో ఊరేగుతున్న స్వామి



భీమడోలులో గణనాథులను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

చవితి ఖర్చు రూ.5 కోట్లు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 14 : ఏలూరు నియోజకవర్గంలో ఏడు రోజుల పాటు జరిగే వేడుకలకు సుమారు రూ.ఐదు కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నట్టు అంచనా. నియోజకవర్గంలో సుమారు 500కు పైగా విగ్రహాలు ఏర్పాటు చేయగా, అందులో ఒక్కొక్కటి రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పైగా కొన్నవే. విగ్రహం కొనుగోలు, పూజలు, డిజే, ఇతరత్రా రంగులకు సగటున రూ.రెండు లక్షల నుంచి రూ. ఐదు లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్టు తెలుస్తోంది. డిజేలకు, మండపాల వద్ద విద్యుత్‌దీపాల అలంకరణ, మండపం, షామియానాలు, కుర్చీలు, పూల ఖర్చు రంగులు, టపాసుల ఖర్చు కలిపి విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ఖర్చు సుమారు రూ.5 కోట్లు వరకు ఉంటుందని అంచనా.

గంగమ్మ చెంతకు గణనాథుడు

వేడుకగా గణపతి నిమజ్జనాలు

గణనాథుడు గంగమ్మ చెంతకు బయలుదేరాడు. తొమ్మిది రోజులుగా పూజలందుకొని నిజ్జనానికి మేళతాళాలు, భాజా భజంత్రీల, బాణసంచా కాల్పులతో ఊరేగింపుతో గంగమ్మ ఒడిలో నిమజ్జనమయ్యాడు. ఈ సందర్భంగా పలుచోట్ల అన్న సమారాధనలు నిర్వహించారు.

ఏలూరు రూరల్/ఏలూరు టూ టౌన్/ ద్వారకాతిరుమల/ పోలవరం/ చింతలపూడి / లింగపాలెం/ టి.నరసాపురం /భీమడోలు /కొయ్యలగూడెం/కామవరపుకోట/ద్వారకాతిరుమల సెప్టెంబరు 15: నియోజక వర్గంలోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన గణపతి మండపాల నుంచి అందంగా అలంకరించిన వాహనాల పై వినాయక విగ్రహాలను ఉంచి కోలాటం, డీజే, మేళతా ళాలతో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం నిమజ్జన కార్యక్రమం నిర్వహి ంచారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శనివారపుపేట ఆకుతోటలో మూషిక వాహనంపై గణనాథుడిని ఊరేగింపుగా తరలించి కృష్ణాకాలువలో నిమజ్జనం చేశారు. ద్వారకాతిరుమల మండలంలోని దేవినే నివారిగూడెంలో స్వామిని చెరువులో నిమజ్జనం చేశారు. ఏలూరు దక్షిణపు వీధిలో శ్రీమార్కండేయ ఓంకార విగ్నేశ్వర స్వామి, అయ్యప్పస్వామి దేవస్థానం, శ్రీగంగా పార్వతి సమేత జాలపహా రేశ్వరస్వామి, శ్రీమహిషాసుర మర్దని అమ్మవారి దేవస్థానాలను ఎమ్మెల్యే బడేటి చంటి సందర్శించారు. ఆయా ఆలయాల్లో చంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దక్షిణపు వీధిలో సదరన్ స్టార్ గణేష్ యూత్, పెద్దదేవుని గుడి ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి నవరాత్రి మండపాలను సందర్శించి గణేశునికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. పోలవరం జగన్నాథపేట వరసిద్ధి వినాయ కుని ఆలయం వద్ద వెండి ఉంగరాన్ని మధ్యలో ఉంచి ప్రత్యేకంగా చేయించిన వినాయ కచవితి లడ్డూకి వేలం నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు హెడ్ కానిస్టేబుల్ రాజేష్ కుమార్, కానిస్టేబుల్ ఎన్.రాము రూ. తొమ్మిది వేల దక్కించు కున్నారు. అనంతరం ఊరేగింపుగా స్వామివారిని తీసుకు వచ్చి పట్టిసీమ ఫెర్రీరేవులో నిమజ్జనం చేశారు. బందోబస్తును ఏఎస్ఐ నాగేశ్వరరావు నిర్వహించారు. నూతన గూడెంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. చింతలపూడి పట్టణంలోని గణేష్‌కా లనీ, విశ్వనాథ ఆశ్ర మం, పలుచోట్ల ఏర్పాటు చేసిన విగ్రహాలను ఊరేగిస్తూ తమ్మిలేరులో నిమజ్జనం చేశారు. చిల్లపల్లి కాంప్లెక్స్‌లో అన్న సమారాధన నిర్వహించారు. టి.నరసాపురం మండలంలోని వల్లంపట్లలో 15 కేజీల లడ్డూకు వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన పల్లగాని గంగరాజు రూ.10,116లకు దిక్కించు కున్నారు. భీమడోలు మండల వ్యాప్తంగా గోదావరి కాల్వలో గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో ఉన్న వినాయక ఉత్సవాల్లో భాగంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు.



ఏలూరులో చిన్నారుల కోలాటం



పోలవరంలో నిమజ్జనానికి తరలి వెళుతున్న గణనాథుడు



టి.నరసాపురంలో వేలంలో లడ్డూను దక్కించుకున్న భక్తులు

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు



ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వెంకటేష్

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 15 : ఏలూరు ట్రాఫిక్ సార్జెంట్‌గా ఆర్ఎస్ఐ వెంకటేష్ ఆదివారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. పోలీస్ శాఖలో ఆర్ఎస్ఐగా విధులను నిర్వర్తిస్తున్న వెంకటేష్‌ను ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సార్జెంట్‌గా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఆయన ఆదివారం ఆయన ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. అనంతరం ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. డీఎస్పీ ఆర్ఎస్ఐతో మాట్లాడుతూ ఏలూరు నగరంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూళ్ళు తెరిచి మూసే సమయాల్లో ఎక్కువ రద్దీ లేకుండా ట్రాఫిక్ నియంత్రణ కోసం కృషి చేయాలన్నారు.

126 మందికి నేత్ర పరీక్షలు

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 15 : స్థానిక రామకోటిప్రాంగణంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్రవైద్య శిబిరంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్య నిపుణులు 126 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణలో సలహాలు, సూచనలు ఇచ్చారు. 27 మందికి కళ్లజోళ్లు అందచేశారు. 18 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. లయన్స్ క్లబ్ నాయకులు ఎం.రామారావు, కె.రత్నప్రసాద్, కె.ప్రసాద్, బి.విష్ణు తదితరులు పాల్గొన్నారు. ఈ ఉచిత నేత్రవైద్య శిబిరానికి ఉషా బాలకృష్ణ ఆర్థిక సాయం అందచేయగా లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానికులు సేవలు అందించారు.

దాతల సహకారం మరువలేనిది



విరాళం అందిస్తున్న కృష్ణమూర్తి

పెదవేగి, సెప్టెంబరు 15 : విజయవాడ వరద బాధి తులకు దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని దెందులూరు ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు మండలం వసం తవాడకు చెందిన చింతల కృష్ణమూర్తి వరద బాధితుల సహాయార్థం రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యేకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ముందుకు నడిపించే దిశగా కృషి చేస్తున్నారని, చంద్రబాబు చేస్తున్న కృషికి మనవంతు సహకారాన్ని అందించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఆర్ స్టేడియం వాకర్స్ విరాళం



ఏలూరు రూరల్, సెప్టెంబరు 15: వరద బాధితులకు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం మార్నింగ్ వాకర్స్ అసోసి యేషన్ రూ.15 వేలు విరాళం ప్రకటించింది. చెక్కును వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడికి అందచేశారు. అధ్యక్షుడు ఎస్.ఎమ్ అక్బర్, గౌరవఅధ్యక్షుడు ఎన్.జగదీషన్, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి



మోక్షగుండ విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 15: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఇంజనీర్స్ డే ఘనంగా నిర్వహించారు. సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సాల్మన్‌రాజు, పలువురు ఇంజనీర్లు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సాల్మన్ రాజును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి ఆయన చేసిన సేవలకు గాను గుర్తింపుగా భారతరత్న అవార్డు ఇచ్చారని ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ ఈఈ వీఎస్‌బీ నటరాజన్, టి.శశిధర్, కె.సత్యకిషోర్, టి.రామకృష్ణ, ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు ఎన్.రఘుబాబు, కృష్ణరాజన్, బీమేశ్వరరావు, రమేష్, మారుతీ, కె.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఇంజనీర్లకు సత్కారం


ఏలూరు అర్బన్, సెప్టెంబరు 15 : ఇంజనీర్స్ డే సందర్భంగా ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీర్లను సత్కరించారు. హైదరాబాద్ ఈసీఐఎల్ డీజీఎం, దీపక్ జెన్ డైరెక్టర్ కొల్లి రాజశేఖరరావు, నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ముక్కామల వెంకట కృష్ణారావును ఘనంగా సన్మానించారు. సంఘ అధ్యక్షుడు ప్రసాద్, బాపినీడు చౌదరి, శివరామ కృష్ణారావు, ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు వడ్లపట్ల నారాయణరావు పాల్గొన్నారు.

నిరంతర కృషీ వలుడు

భీమడోలు, సెప్టెంబర్ 15 : నవ భారత నిర్మాత మోక్షగుడ్డం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. మోక్షగుడ్డం విశ్వేశ్వరయ్య 163వ జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి సామాజిక కార్యకర్త మండే సుధాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంతాపాలు.. పరామర్శలు..

సత్యవతి సేవలు మరువలేనివి



సత్యవతికి నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

దెందులూరు, సెప్టెంబరు 15 : యాదవుల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర వ్యాప్తం గా కృషి చేసిన యాదవ సంఘం రాష్ట్ర నాయకురాలిగా బీసీలతో పాటు పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నెరుసు సత్యవతిని ప్రజలు మరువలేరని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కొవ్వలిలో ఆదివారం ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్ర ప్రదేశ్ యాదవ్ సంఘం రాష్ట్ర అధ్యక్షు డు నెరుసు వెంకట సుబ్బయ్య మాతృమూర్తి సంతాప సభ జరిగింది. ఎంపీ ఎమ్మెల్యేలతో పాలు పలువురు సత్యవతి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటసుబ్బయ్యను పరమర్శిం చి సానుభూతి తెలిపారు. అనంతరం 300 మంది పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, మోతుకూరి నాని, యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రమ్మకు ఘన నివాళి

మొటపర్తి కుటుంబం చేసిన సేవ, దానాలు, విరాళలు మనందరికీ స్ఫూర్తి అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గ్రామంలోని విజయనగేష్, నర్సింగ్ కళాశాల అవరణలో స్వర్గీయ మొటపర్తి రామచంద్రమ్మ సంతాప సభ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే చింతమనేని రామచంద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చింతమనేని మాట్లాడుతూ రూ.వంద కోట్లు విలువ చేసే ఆస్తులను దానం చేసిన స్వర్గీయ మొటపర్తి వెంకటసుబ్బారావు, రామచంద్రమ్మ స్ఫూర్తిదాతలని వారి ఆశయ సాధన కోసం కృషి చేద్దామ న్నారు. తణుకు విద్యా సంస్థల చైర్మన్ మొటపర్తి రాజా, మానవత సంస్థ మండల అధ్యక్షుడు సంపంగి వేణుగోపాల తిలక్, మండల టీడీపీ అధ్యక్షుడు మిల్లుబాబు, మోతుకూరినాని,గారపాటి కొండయ్యచౌదరి, యిప్పిలి వెంకటేశ్వర రావు, తోట యేసమ్మ, మహేష్‌యాదవ్, తదితరులు నివాళులర్పించారు.

మద్దిపోటిని పరామర్శించిన తపన చౌదరి



టీడీపీ నాయకులు మద్దిపోటిని పరామర్శిస్తున్న తపన చౌదరి

కామవరపుకోట, సెప్టెంబరు 15 : మద్దిపాటివారిగూడెంకు చెందిన టీడీపీ నాయకులు, తెలుగు రైతు ఏలూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు మద్దిపోటి నాగేశ్వర రాంబాబు ఇటీవల ఒక కారు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై చికిత్స పొంది అనంతరం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న తపన ఫౌండేషన్ అధినేత తపన చౌదరి ఆదివారం మద్దిపోటి నాగేశ్వరరాంబాబును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసు కున్నారు. బీజేపీ ఏలూరు పార్లమెంటు కన్వీనర్ కె.కృష్ణప్రసాద్, చింతలపూడి అసెంబ్లీ కన్వీనర్ ఒ.యేసువరప్రసాద్, సీనియర్ బీజేపీ నాయకులు, కె.సురేష్ కుమార్ (చంటి), మండల అధ్యక్షులు బి.ఇంద్రుని బాలవర్ధిరాజు, యువమోర్చ నాయ కులు ఎస్.భావనాచార్యులు, ఎస్.శివరామకృష్ణమూర్తి ఉన్నారు.

ముత్తారెడ్డిని..

చింతలపూడి, సెప్టెంబరు 15: ఇటీవల హైదరాబాద్‌లో బైపాస్ సర్జరీ చేయించుకుని సొంత గ్రామం యర్రంపల్లి గ్రామం వచ్చిన మాజీ ఏఎంసీ అధ్యక్షులు జగ్గవరపు ముత్తారెడ్డిని, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి తపనా చౌదరి ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ప్రసాద్, తోట నారాయణ, వరప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 15 : మన్యం దేవత శ్రీగుబ్బల మంగమ్మతల్లి అమ్మవారిని దర్శించుకోడానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఏజెన్సీలో భారీ వర్షాలు కురడంతో కొండవాగులు పొంగడంతో అమ్మవారి దర్శనా లను కొన్ని రోజులకుగా అధికారులు నిలిపివేశారు. మూడు రోజులుగా వాతావ రణం పొడిగా ఉండడంతో అమ్మవారిని భక్తులు యదావిధిగా దర్శించుకో వచ్చని ఆలయ కమిటీ ప్రకటించడంతో భక్తులు అధికంగానే తరలివచ్చారు. వర్షం కురుం దన్న హెచ్చరికతో భక్తులను సాయంత్రం మూడు గంటలకే పంపించి వేశారు.

శ్రీవారి క్షేత్రంలో కిటకిటలాడిన భక్తులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 15: చిన్నతిరుమలేశుని ఆలయం ఆదివారం భక్తజనులతో పోటెత్తింది. దాదాపు 10 వేల మంది పైబడి యాత్రికులు శ్రీవారు, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. సెలవుదినం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు క్షేత్రానికి చేరుకుని క్యూలైన్లలో శ్రీవారి దర్శనం కోసం వేచి చూశారు. స్వామి దర్శనం అనంతరం వకుళమాత అన్నప్రసాద భవనంలో ప్రసాదం స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 15 : చెట్టుకొమ్మలు తొలగిస్తున్న కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు, పర్రెడ్డిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న లక్ష్మీ గణపతి టౌన్ షిప్, న్యూ బస్టాండ్, ఏలూరు రోడ్డు, మారుతీనగర్, సూర్యకాలేజీ రోడ్డు, బాట గంగానమ్మ ఫీడర్ మీద ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు బాట గంగానమ్మ లే అవుట్ ఏరియా, శివాలయం వీధి, అయ్యప్ప టౌన్ షిప్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆ శాఖ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు.

జంగారెడ్డిగూడెం డివిజన్ టీమ్ విజయం

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 15 : జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఆదివారం జరిగిని ఉపాధ్యాయుల జిల్లా స్థాయి క్రికెట్ ఫైనల్ పోటీలలో జంగారెడ్డిగూడెం డివిజన్ జట్టు, భీమడోలు డివిజన్ జట్టుపై ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. విజేతలను యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంవీ శ్యాంబాబు అభినందించారు.

కోడి పందేలు నిర్వహించే నలుగురి అరెస్టు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 15 : రౌతుగూడెంలో కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై ఆదివారం ఎస్సై పి.నవీన్‌కుమార్ సిబ్బంది కలసి దాడి చేశారు. వారి నుంచి వెయ్యి నగదు, కోడి పుంజు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఆటోను ఢీకొన్న ఆవు.. ఒకనికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 15 : రోడ్డుపై వెళ్తున్న ఆటోను పొలంలో నుంచి వచ్చిన ఆవు ఢీకొడంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరులోని ఫిల్‌హౌస్‌పేటనకు చెందిన పాస్టర్ ఇజ్రాయేల్ మరో నలుగురు యువకులు కలిసి జంగారెడ్డిగూడెంలోని ప్రార్థనలకు ఆదివారం ఒక ఆటోలో ఏలూరు నుంచి వెళ్తున్నారు. మార్గ మధ్యలో తడికలపూడి పోలీస్ స్టేషన్ సమీపంలో వేగంగా వెళ్తున్న ఆటోను పొలంలో నుంచి పరిగెత్తుకొచ్చిన ఆవు ఢీకొంది. దీంతో ఆటో బోల్తా కొట్టింది. దీంతో ఏలూరునకు చెందిన కాటి రామారావు (22) తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే అతనిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిగిలిన నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. ఆస్పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కొండ దిగుతుండగా ఆటో బ్రేక్ ఫెయిల్

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 15: శ్రీవారి శేషాచల ఘాట్‌రోడ్డులో బ్రేక్ పెయిల్ కావడంతో ఓ యాత్రికుల ఆటో వేగంగా దిగువకు ప్రయాణించి ఒక షాపులోకి దూసుకెళ్లింది. నూజివీడు సమీపంలోని దేవరకొండకు చెందిన పది మందితో కూడిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనార్థం ఆదివారం ద్వారకా తిరుమలకు వచ్చింది. తిరుగుప్రయాణంలో ఘాట్‌రోడ్డులో కిందకు దిగుతున్న సమయంలో ఒక్కసారిగా ఆటో బ్రేక్ ఫెయిలైంది. కిందకు దూసుకెళ్తున్న ఆటోను డ్రైవర్ చాకచక్యంగా ఎదురుగా ఉన్న ఆర్చిగేటును తప్పించి ఓ మూసి ఉన్న షాపులోకి పోనిచ్చాడు. అయితే షాపులో ఉన్న కొన్ని విలువైన సామాన్లు ధ్వంసమయ్యాయి. అయితే ఆటోలో ఉన్న జంపాల రామాంజనేయులు అనే భక్తుడు భయంతో కిందకు దూకేశాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయాలు కావడంతో ద్వారకాతిరుమల ప్రభుత్వస్పత్రికి తరలించారు. మిగతా ఆటోలో ఉన్న ఎవరికీ గాయాలవ్వకపోడంతో ఊపిరి పీల్చుకున్నారు.

సారా పట్టివేత

కుక్కునూరు, సెప్టెంబర్తు 15: మండల పరిధిలోని మారేడువాక గ్రామశివారుల్లో సారాబట్టిల పై ఆదివారం కుక్కునూరు సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో దాడులు జరిపారు. ఈ దాడుల్లో 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 15 : మద్యం మత్తులో ఉన్న వ్యక్తి అదృశ్యం అయ్యాడు. బీహార్‌కు చెందిన కొంత మంది కూలీలు ఏలూరు - ఆశ్రం ఆసుపత్రి మార్గం మధ్యలో వేసగాని బ్రిడ్జి పక్కన ఉన్న శ్రీ విజయదుర్గ ట్రేడర్స్‌లో పనిచేస్తున్నారు. అక్కడ పాత సామాన్లను, ప్లాస్టిక్ వస్తువులను వేరు చేసి వాటిని హైడ్రాలిక్ మిషన్ల ద్వారా బేళ్ళుగా తయారు చేస్తారు. పుల్సర్ శర్మ (35) అనే యువకుడు హైడ్రాలిక్ మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతను కనిపించడం లేదు. కూలీలు వెళ్ళి చూడగా ఆ మిషన్‌లో ప్లాస్టిక్ సామాన్లు నొక్కబడి ఉన్నాయి. వాటి మధ్య నుంచి రక్తం రావడంతో అతను పనిచేసే మిషనే కావడంతో మద్యం మత్తులో ఉన్న శర్మ దానిలో పడి మరణించి ఉంటాడేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ పోలీసులు ఎస్ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాత్రి వేళ కావడంతో ఆ ప్లాస్టిక్ సామాన్లను తొలగించడం సాధ్యం కాకపోవడంతో సోమవారం పరిశీలించనున్నారు. శర్మ సెల్‌ఫోన్ రింగవుతూనే ఉంది.


మంత్రికి విరాళం అందిస్తున్న కనసానపల్లి నాయకులు


మంత్రి పార్థసారథికి చెక్కు అందిస్తున్న చాట్రాయి నాయకులు


ఎమ్మెల్యే కామినేనికి విరాళాలిస్తున్న కైకలూరు టీడీపీ నేతలు


ముదినేపల్లిలో కామినేనికి విరాళాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

పెద్ద మనస్సుతో..

▸▸విజయవాడ వరద బాధితుల కోసం విరాళాలు ▸▸మంత్రి సారథి, ఎమ్మెల్యే కామినేనికి అందజేసిన దాతలు

నూజివీడు/ఆగిరిపల్లి, సెప్టెంబరు 15: రాష్ట్రంలో వరద బాధితుల సహాయం అందించిన దాతలందరికీ మంత్రి కొలుసు పార్థసారథి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం నూజివీడులో ఆగిరిపల్లి మండలం కనసానపల్లి గ్రామానికి చెందిన నాయకులు, రూ.2.51 లక్షల చెక్కును మంత్రి పార్థసారథికి అందించారు.

చాట్రాయి: మంత్రి కొలుసు పార్థసారథి పిలుపు మేరకు టీడీపీ నాయకులు వరద బాధితులకు విరాళం అందించారు. చాట్రాయికి చెందిన టీడీపీ బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు కంపసాటి చెన్నారావు, సీనియర్ నాయకుడు గోగుల శ్రీమన్నారాయణ సీఎం సహాయనిధికి రూ.10 వేలు చెక్కును ఆదివారం నూజివీడులో మంత్రికి అందించారు.

కైకలూరు టీడీపీ నేతల విరాళాలు

కైకలూరు, సెప్టెంబరు 15: వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరు మండలం వరహాపట్నంలో కైకలూరు టీడీపీ నేతలు సేకరించిన రూ.6,74,116లను ఎమ్మెల్యే కామినేనికి అందజేశారు. టీడీపీ ఆధ్వర్యంలో ఈ విరాళాలను సేకరించి ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ ఇంత పెద్దఎత్తున విరాళాలను టీడీపీ తరఫున సేకరించడం అభినందనీయమన్నారు. టీడీపీ నాయకులు వీజేఎస్ మాల్యాద్రి, పోలవరపు లక్ష్మీరాణి, పెన్మెత్స త్రినాథరాజు, ఎండీ జానీ, పైడిమర్రి రాధాకృష్ణ, ఈదా వెంకటస్వామి, తలారి రాజేష్, గంగుల ఏసురాజు, ఎండీ ఉస్మాన్, సయ్యద్ బాషీద్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి మండలం నుంచి...

ముదినేపల్లి: మండలం నుంచి పెద్ద ఎత్తున సీఎం సహాయ నిధికి విరాళాలను అందజేశారు. మండల టీడీపీ నాయకులు రూ.9 లక్షలు, వైవాక ఆక్వా రైతులు రూ.5 లక్షలు, డీసీ కమిటీ మాజీ చైర్మన్ లింగమనేని భాను ప్రసాద్ రూ.50 వేలు, చినపాలపర్రు, వడాలి, ప్రొద్దువాక తదితర గ్రామాల రైతులు రూ.50 వేలు విరాళాలను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు ఆదివారం ముదినేపల్లిలో అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

హత్య కేసులో ఐదుగురు నిందితుల అరెస్టు

ముదినేపల్లి, సెప్టెంబరు 15: ముదినేపల్లి మండలం ఊటుకూరు గ్రామంలో ఈ నెల 7న పోసిన బాలకోటయ్య (54) హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గ్రామానికి చెందిన గూడవల్లి శ్రీనుబాబు, అతని తండ్రి గూడవల్లి శివాజీ, బాబాయి శ్రీనివాసరావు, పెదనాన్న మహంకాళిరావు, హతుడితో పాత కక్షలు ఉన్న పక్కిరి నాగరాజును శనివారం సాయంత్రం ముదినేపల్లిలోని కైకలూరు రోడ్డులో కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్ అరెస్టు చేశారు. నిందితులను ఆదివారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో మీడియా ముందు ప్రవేశపెట్టారు. బాలకోటయ్యకు, నిందితులకు మధ్య పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని సీఐ తెలిపారు. వీరిని గుడివాడ జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కలిదిండి, సెప్టెంబరు 15 : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం వెంకటాపురానికి చెందిన వేగేశ్న కాశీవిశ్వనాథ రాజు (39) ఆరేళ్లుగా కలిదిండి మండలం మూల్లంకలో నివాసం ఉంటూ పెదలంకలో ఓ రైతు చేపల చెరువుపై కాపలా ఉంటున్నాడు. శనివారం చేపల చెరువులో మేత వేసి తిరిగి బైక్‌పై మూల్లంక వెళ్తుండగా, అప్పారావుపేట సమీపంలో రోడ్డుపై ఉన్న గోతుల్లో బైక్ అదుపు తప్పి పడిపోయాడు. వెనుక నుంచి వస్తున్న స్కూల్ వ్యాన్ పడిపోయిన విశ్వనాథరాజును ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడ్ని భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్ ఎస్.డి.వి.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్



నిందితులను మీడియాకు చూపుతున్న డీఎస్పీ

నూజివీడు, సెప్టెంబరు 15: నూజివీడు మండలంలో పలు ప్రాంతాల్లో రోడ్డుపక్కన నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను, పొలాల్లోని డ్రిప్ పైపులను దొంగిలిస్తున్న ముఠాను నూజివీడు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నూజివీడు ఇన్‌చార్జి డీఎస్పీ, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం నూజివీడు మండలం రావిచర్ల కాటా వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆగిరిపల్లికి చెందిన ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. దీంతో ఈజీ మనీకి అలవాటుపడి ఆగిరిపల్లి, విస్సన్నపేట, ఎ.కొండూరు, మైలవరం తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల అపహరణ, డ్రిప్ పైపుల దొంగతనం వ్యవహారం బయటపడిందన్నారు. నిందితుల నుంచి రూ.4.50 లక్షలు విలువచేసే పది ద్విచక్ర వాహనాలను, ప్లాస్టిక్ డ్రిప్ పైపులను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. నిందితులు తాము దొంగిలించిన వాహనాలను విడి భాగాలుగా చేసి బృందావన కాలనీలోని సతీష్ అనే వ్యక్తికి అమ్ముతున్నట్టు, డ్రిప్ పైపులను ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెంకు చెందిన విజయ్‌కు విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. వాహనాల రికవరీలో చురుగ్గా వ్యవహరించిన రూరల్ సీఐ రామకృష్ణ, నూజివీడు రూరల్ ఎస్సై లక్ష్మణ్ బాబు తదితరులను ఆయన అభినందించారు.

ప్రమాదానికి గురై చికిత్సకు వెళితే బైక్ చోరీ!

ముదినేపల్లి, సెప్టెంబరు 15 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన ఓ యువకుడిని స్థానికులు హడావిడిగా ఆసుపత్రికి తరలించగా, ఆ యువకుడు వినియోగించిన బైక్‌ను దొంగలు తస్కరించారు. ముదినేపల్లి మండలం పెయ్యేరు ఎస్సీ కాలనీకి చెందిన వెలగలేటి మహేష్ అనే యువకుడు శనివారం ఉదయం దాకరం వైపు వెళ్తుండగా, మార్గ మధ్యంలో బైక్ అదుపు తప్పి కిందపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే అతనిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అనంతరం సాయంత్రానికి ఇంటికి తిరిగి వచ్చారు. ప్రమాదం జరిగిన స్థలంలో ఉదయం వదిలేసిన బైక్ కనిపించలేదు. దీనిపై మహేష్ తల్లి మార్తమ్మ ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వేద విద్యను పరిరక్షించాలి


ప్రసంగిస్తున్న ఎల్వీ సుబ్రహ్మణ్యం

ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం

ఆగిరిపల్లి, సెప్టెంబరు 15: వేద విద్యని పరిరక్షించకపోతే అది భావితరాలకు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం ఆగిరిపల్లిలో శోభనాచల లక్ష్మీనరసింహస్వామి వేద పాఠశాల 116 వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయన సభికులను ఉద్దేశించి మాట్లాడుతూ పాత తరాల వారు ముందు చూపుతో నేర్పిన వేద విద్య వల్ల ఇప్పుడు ఇంతమంది వేద పండితులు ఉన్నారని, ఆధునిక శాస్త్ర విద్యలో ఫలితాలు అంతగా ఉండటం లేదని, ఇప్పుడున్న శాస్త్రవేత్తలందరికీ సంస్కృతం రాదని, వచ్చి ఉంటే భారత్ ఎప్పుడో అగ్రరాజ్యంగా అవతరించేదని, వేదం చదివే పండితులకు ఆధునిక శాస్త్రం తెలియటం లేదని ఈ రెండు కలిసి ఉంటే దేశరక్షణ పరిస్థితులు మెరుగవవచ్చని తెలిపారు. ఇప్పటి జనరేషన్ వేదం అంటే పెళ్ళి సమయంలో ఉపయోగపడే మంత్రాలు అనుకుంటున్నారని కొన్ని వాఙ్మయాల్లో రాడార్లు కూడా పసిగట్టలేని అదృశ్య పరిజ్ఞానం ఉందని వేదశక్తితో పాటు లౌకిక విద్య కూడా కలిపి అభ్యసించాలని కోరారు. దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ ఆగిరిపల్లిలో వేద పాఠశాల స్థాపించిన మార్కండేయ శర్మ కృషి వల్ల ఈ పాఠశాల ఇంత గొప్పగా నడుస్తోందని భారతదేశం వేద భూమి అయినందున వేదాలను సంరక్షించుకోవాలని, ఆధునిక విద్యతో వేద విద్య మిళితం చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లు ఆలయాలు, ఇతర ప్రదేశాల్లో వేదాశీర్వాదం ఇచ్చేటప్పుడు ప్రజలకు అర్థమయ్యేలా తాత్పర్యం బోధించాలని, ఇవి అర్థమైతే ప్రజలు పరమతాల వైపు మరలరన్నారు. ఆదాయ పన్ను శాఖ మాజీ డైరెక్టర్ పేర్వాల రఘు, ద్వారకా తిరుమల మాజీ ఈఓ విష్ణు ప్రసాద్, చిర్రావూరి శ్రీరామ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరుల ఆర్థికాభివృద్ధికి కృషి

మంత్రి పార్థసారథి

మునునూరు, సెప్టెంబరు 15: రాష్ట్రంలో గొర్రెలు, మేకల కాపరుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గోగులంపాడులో ఆదివారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని నట్టల నివారణ మందు, దానామృతాన్ని కాపరులకు పంపిణీ చేసి మాట్లాడుతూ గొర్రెలు, మేకల ఫామ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలిస్తోందని, పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. వరదలతో పశు సంపదను నష్టపోయిన వారికి పరిహారం అందిస్తామన్నారు. మండలంలో 33 వేలు గొర్రెలు, 420 మంది రైతులు ఉండగా ఒక్క గోగులంపాడులోనే 3 వేలు జీవాలు ఉన్నాయని, ప్రతి జీవానికి నట్టల నివారణకు టీకాలు వేయాలని, మందులను సైతం వెంటనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం ఆయన గొర్రెలకు దానామృతాన్ని వేసి, కాపరులకు దాణా, మందులను పంపిణీ చేశారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, ఏడీ లింగయ్య, వైద్యాధికారి వెంకట చైతన్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు మృతి



మునునూరు, సెప్టెంబరు 15: మునునూరు గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, మాజీ ఎంపీటీసీ మానికల అంజనేయులు (80) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ప్రధానోపాధ్యాయుడిగా అనేక మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతోపాటు ఎంపీటీసీగా గ్రామాభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు దేవినేని ఢలరాం, ఎంపీటీసీ తులిమెల్లి కృష్ణకుమారి ప్రసాదరావుతోపాటు పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు ఆంజనేయులు భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించి, ఆయన కుటుంబీకులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సీపీఐ నాయకుడు చదలవాడ మృతి



మునునూరు, సెప్టెంబరు 15: మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు చదలవాడ నారాయణరావు (85) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన సీపీఐ తాలుకా సమితి సభ్యుడిగా, పార్టీ గ్రామ కార్యదర్శిగా పనిచేశారు. ఆదివారం సీపీఐ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు అక్కినేని వనజ, చలసాని వెంకట రామారావు, కొమ్మన నాగేశ్వరరావు, నిమ్మగడ్డ నరసింహ, గుంటక ధర్మారెడ్డి, రాయంకుల లక్ష్మణరావు, కూచిపూడి నాగేశ్వరరావు అయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళుల ర్పించారు. ఆయన పార్థివ దేహంపై పార్టీ జెండాను కప్పి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులందరికీ పరిహారం

ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

ముదినేపల్లి, సెప్టెంబరు 15 : పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలో ముంపునకు గురైన వరి పొలాలను ఆయన ఆదివారం పరిశీలించారు. పోల్‌రాజ్, పెదకొమ్మిలేరు మేజర్ డ్రైన్లలో డెక్క తొలగించకపోవటం వల్లే పొలాలు ముంపునకు గురయ్యాయని రైతులు తెలపగా వచ్చే ఏడాది నుంచి సార్వా సీజన్‌కు ముందే డ్రైన్లను బాగు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నష్టపోయిన పంటను అధికారులు పూర్తిగా నమోదు చేయటం లేదని చినపాలపర్రు రైతులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా వెంటనే వ్యవసాయ శాఖ జేడీతో ఫోన్‌లో మాట్లాడి నష్టపోయిన రైతులందరి పేర్లు నమోదు చేయాలన్నారు. చినపాలపర్రులో ముంపు పరిస్థితిని రైతు దుక్కిపాటి చక్రధర్ వివరించి, వరద బాధితులకు రూ.20 వేలు విరాళం అందజేశారు. కూటమి నాయకులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, వీరమల్లు నరసింహారావు, చలసాని జగన్మోహనరావు, రౌతు మాధవి తదితరులు పాల్గొన్నారు. మండలంలో బీజేపీ సభ్యత్వాల నమోదును ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో 300 సభ్యత్వాలను నమోదు చేయాలని తెలిపారు.

450 మందికి ఉచిత కంటి పరీక్షలు



కలిదిండి, సెప్టెంబరు 15 : పెదలంక నాగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం విజయవాడ కంటి ఆసుపత్రి, వెలమ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు అక్కల వెంకటాచలం (బోసు) సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 450 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కళ్లజోళ్లను పంపిణీ చేశారు. వైద్యులు ఏ.భవాని, కె.శశి రేఖ, వై.ప్రశాంత్ కుమార్, ఎం.శిరీష వైద్య సేవలందించారు. టీడీపీ నాయకులు దున్న భోగేశ్వరరావు, ముద్దం వీరాస్వామి, పోకల ప్రసాద్, ముద్దం వెంకన్న, గ్రామ పెద్దలు కోకా రాజు, పిల్లారిశెట్టి వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



చాట్రాయి, సెప్టెంబరు 15: కృష్ణారావుపాలెంలో ఆక్రమణలో ఉన్న 1.45 ఎకరాల భూమిలో తహసీల్దార్ ప్రశాంతి ఆదేశాల మేరకు ఆదివారం రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. సదరు భూమి ప్రభుత్వానికి చెందిందని ఎవరూ ప్రవేశించరాదని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.


నిత్యావసరాలు అందిస్తున్న వ్యాయామోపాధ్యాయులు

బాధితులకు వ్యాయామోపాధ్యాయుల వితరణ

నూజివీడు టౌన్, సెప్టెంబరు 15: నూజివీడు పెద్దచెరువు ముంపుతో నష్టపోయిన బాధితులకు నూజివీడు నియోజకవర్గంలోని వ్యాయామో పాధ్యాయులు నిత్యావసరాలను పంపిణీ చేశారు. చెరువుకట్ట కింద నివాసం ఉంటున్న వారికి, దుర్గమ్మగుడి సమీపంలోని వారికి నిత్యావసరాలను పంపిణీ చేశారు. వ్యాయామోపాధ్యాయులు నాగరాజు, రవీంద్ర, లక్ష్మి, సుగుణరావు, సతీష్, ప్రభాకర్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తరఫున నిత్యావసరాల పంపిణీ



కలిదిండి, సెప్టెంబరు 15 : మండలంలో సున్నంపూడి, మద్వాని గూడెం, కొండంగి పల్లిపాలెం, యడవల్లి గ్రామాల్లో ఉప్పుటేరు ముంపు బాధితులకు ఆదివారం తహసీల్దార్ రామకృష్ణ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 98 కుటుంబాలకు ప్రభుత్వం అందించిన నిత్యావసర సరుకులను పంపిణీ చేశామన్నారు. గుర్వాయిపాలెం సర్పంచ్ బత్తిన ఉమామహేశ్వరరావు, కొండంగి సర్పంచ్ తిరుమలశెట్టి జ్యోతి, కూటమి నాయకులు, వీఆర్వోలు పాల్గొన్నారు.



కైకలూరు: వరద బాధితులకు ప్రభుత్వం అంది స్తున్న నిత్యవసర సరుకులను కైకలూరు మండలం ఆటపాకలో ఉప సర్పంచ్ బావిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆదివారం ఎమ్మెల్యే కామినేని ఆదేశాలతో ఆటపాక శివారు జానపేటలో 205 కుటుంబాలకు సరుకులను అందజేశారు. ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో వీరికి ప్రభుత్వం నిత్యావసర సరుకులను అందజేసింది. వీఆర్వో కృష్ణప్రసాద్, వీఆర్ఏ మల్లిక, తదితరులు పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీలో ఎన్ఎస్ఎస్ పారిశుధ్య పనులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 15: నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆదివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3, 4, 6కు చెందిన 250 మంది వలంటీర్లు ఆస్పత్రి, క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రావణి, ప్రోగ్రాం ఆఫీసర్ మధు, ఏవో లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


కైకలూరు నిమజ్జనానికి తరలుతున్న ఆది వినాయకస్వామి

బై బై గణేశా..

కైకలూరు, సెప్టెంబరు 15: చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను ఆదివారం ఊరేగింపుగా నిమజ్జనాలకు తరలించారు. కైకలూరు చిన్న చెరువుగట్టు వద్ద ఏర్పాటుచేసిన ఆది వినాయక స్వామి, వారపు సంత వద్ద గల గణనాథుడిని కైకలూరు పురవీధుల్లో బాజా భజంత్రీలు, విచిత్ర వేషధారణల మధ్య ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. కైకలూరు వైఎస్సార్ కాలనీలోని ఆది వినాయక స్వామి మండపం వద్ద అన్నసమారాధన జరిగింది.

నూజివీడు టౌన్: వినాయకుడి ఆశీస్సులు అందరికీ ఉండాలని మంత్రి కొలుసు పార్థసారథి ఆకాంక్షించారు. నూజి వీడు పట్టణం చిన్నగాంధీబొమ్మ సెంటర్, గాంధీనగర్, వినాయ కుడి గుడి తదితర ప్రాంతాల్లో గణేష్ మండపాలను సందర్శించి పూజలు నిర్వహించారు. లడ్డూ వేలంలో వచ్చిన నగదును విజయవాడ వరద బాధితుల సహాయార్థం అందిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, టీడీపీ నాయకులు ఇళయరాజా, పి.నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా నూజివీడు మండలం జంగంగూడెం గ్రామంలో లడ్డూను వల్లభనేని లక్ష్మణ చౌదరి రూ.24,011లకు పాడారు. విచిత్ర వేషధారణలు, కోలాటాల మధ్య గణనాథులను నిమజ్జనాలకు తరలించారు.

చాట్రాయి: చనుబండ ఎల్లమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడిని ఆదివారం మేళతాళాలతో వైభవంగా ఊరేగించారు. ఆరుగొలనుపేట శ్రీలక్ష్మమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో ఆదివారం భారీ అన్నసమారాధన జరిగింది.

ముదినేపల్లి: గణపతి నవరాత్రుల సందర్భంగా ముదినేపల్లి మండలం అప్పారావుపేటలో ఆదివారం ఘనంగా అన్నసమారాధన జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, కూటమి నాయకులు పూజలు జరిపి సమారాధన ప్రారంభించారు. శ్రీహరిపురంలో దాసాంజనేయస్వామి ఆలయం వద్ద నవరాత్రుల ముగింపు సందర్భంగా అన్నసమారాధన జరిగింది.

భారీ ధర పలికిన లడ్డూ ప్రసాదాలు

మునునూరు: చెక్కపల్లి రామాలయంలో గణనాథుడి 9 కేజీల లడ్డూ ప్రసాదాన్ని కాటేపల్లి వెంకటరత్నం కుమారుడు పవన్‌కుమార్ రూ. 1 లక్ష 5 వేలకు దక్కించుకున్నారు. పెద్దపాటివారిగూడెం కోదండ రామాలయంలో కొలువుదీరిన గణేశుడి 5 కేజీల లడ్డూ ప్రసాదాన్ని టీడీపీ నాయకుడు మాకినేని నాగార్జున దంపతులు రూ.72 వేలకు పాడుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. వైభవంగా ఊరేగుతూ గణనాథులు నిమజ్జనాలకు తరలారు.

కలిదిండి: కలిదిండి సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడికి దాతలు సమర్పించిన 104 కిలోల తాపేశ్వరం లడ్డూకు ఆదివారం వేలం నిర్వహించగా, కలిదిండి వసంత టీస్టాల్ నిర్వాహకులు, ఎంపీటీసీ నీలి సుమన్‌లు రూ.88,500లకు దక్కించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు బోయిన గోవింద్, మేకా భోగేశ్వరరావు, నాగరాజు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు. పెదలంకలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడిని మేళతాళాలతో ఘనంగా ఊరేగించి ఉప్పుటేరులో నిమజ్జనం చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బ్రహ్మాజీరావు, పిల్లారిశెట్టి సురేష్, పోకల కృష్ణ, అయినాల వెంకన్నబాబు, సత్యనారాయణ, ఇమ్మానేని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



కలిదిండి మండలం పెదలంక, నూజివీడు పట్టణంలో నిమజ్జనాలకు తరలుతున్న గణనాథులు


పెద్దపాటివారిగూడెంలో లడ్డూను స్వీకరిస్తున్న మాకినేని నాగార్జున దంపతులు